



నేటి నుంచి పూర్తిస్థాయిలో ఇంటర్ మూల్యాంకనం

- సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రక్రియ
- మహిళా కళాశాలలో పకడ్బందీగా ఏర్పాట్లు
- నెలాఖరుకు పూర్తి
- ఆర్ఐవో మురళీధర్
- వచ్చే నెల రెండో వారంలో ఫలితాలు విడుదల?



మద్దిలపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ జవాబుపత్రాల మూల్యాంకనాన్ని బుధవారం నుంచి పూర్తిస్థాయిలో చేపట్టనున్నారు. ప్రస్తుతం జైలు రోడ్డులోని మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక్కపూట మాత్రమే నిర్వహిస్తున్న ఈ ప్రక్రియను ఇక నుంచీ రెండు పూటలా కొనసాగిస్తారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం జరుగుతుందని ఆర్ఐవో బి.మురళీధర్ తెలిపారు.

పీఠాపురం కాలనీలో ఉన్న ఆర్ఐవో కార్యాలయం డీఆర్‌డీసీ సెంటర్‌కు ఇతర జిల్లాల నుంచి సుమారు 3.7 లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. ఇతర జిల్లాల నుంచి వచ్చిన నలుగురు అధ్యాపకులను డీఆర్‌డీసీ అధికారులుగా నియమించారు. వారే ప్రతిరోజూ జవాబు పత్రాలను స్పాట్ వాల్యూయేషన్ సెంటర్‌కు తరలిస్తారు. సెంటర్‌లో మరో బృందం జవాబు పత్రాలపై ఉన్న ఓఎంఆర్ షీట్స్ (విద్యార్థి వివరాలు)ను తీసివేసి, కోడింగ్ చేస్తుందని, మూల్యాంకనానికి 1,100 మందిని నియమించినట్టు ఆర్ఐవో తెలిపారు. పేపర్లు కోడింగ్ చేసి సిబ్బంది వెళ్లిపోయాక, ఎగ్జామినర్లు వచ్చి మూల్యాంకనం చేస్తారని, సబ్జెక్ట్‌ల వారీగా అధ్యాపకులు రోజుకు 30 పేపర్లు చొప్పున దిద్దుతారని చెప్పారు. ఒక్కో పేపర్‌కు రూ.23.66, టీఏ, డీఏ, లోకల్ కన్వేయన్స్/అవుట్ స్టేషన్ అలవెన్స్ చెల్లిస్తారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో...

ఇంటర్ జవాబు ... మిగతా 6వ పేజీలో

భారీ వాహనాలతో బెంబేలు

24 గంటలూ నగరం మధ్య నుంచి రాకపోకలు

- బైపాస్ (కొత్త రహదారి) అందుబాటులోకి వచ్చినా టోల్ ట్యాక్స్ తప్పించుకునేందుకు పాత మార్గంలోనే ప్రయాణం...
- పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని పోలీసులు



పోర్టు ఆసుపత్రి వద్ద జాతీయ రహదారిపై భారీ లోడుతో వెళుతున్న లారీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కూర్మన్నపాలెం జంక్షన్‌లో ఈ నెల 13వ తేదీన ద్విచక్ర వాహనాన్ని భారీ టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడ మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

వెంకోజీపాలెం జంక్షన్ సమీపాన ఈ నెల 15వ తేదీ ఉదయం ముందు వెళుతున్న కారును వెనుక నుంచి భారీ వాహనం ఢీకొంది. దీంతో కారు రోడ్డుపై బోల్తాపడింది. అదృష్టవశాత్తూ కారులో ఉన్నవారు ప్రాణాలతో బయటపడ్డారు.

...ఇలాంటి ఘటనలు నగరంలో ఇటీవల కాలంలో పెరుగుతున్నాయి.భారీ వాహనాలతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో రద్దీ సమయాల్లో నగరంలోకి భారీ వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించాలనే డిమాండ్ నగరవాసుల నుంచి వినిపిస్తోంది.

భారీ వాహనాలను పెద్ద నగరాలు, పట్టణాల్లోకి ఉదయం ఏడు నుంచి రాత్రి పది గంటల వరకు అనుమతించరు. రాత్రి పది తరువాత ఉదయం ఏడు గంటల లోపు మాత్రమే అనుమతిస్తారు. అయితే విశాఖ విషయానికి వస్తే నగరం మధ్య నుంచి జాతీయ రహదారి వెళుతోంది. దీంతో భారీ వాహనాలు ఏ సమయంలోనైనా రాకపోకలు సాగించగలుగుతున్నాయి. దీనివల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఉదయం ఎనిమిది నుంచి రాత్రి పది గంటల వరకు నగర పరిధిలోని రోడ్లన్నీ ప్రజల రాకపోకలతో రద్దీగా ఉంటాయి. మారికవలస, కొమ్మాది, కార్‌షెడ్, ఎండాడ, హనుమంతవాక, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, తాటిచెట్లపాలెం, షీలానగర్, గాజువాక వంటి జంక్షన్లలో ట్రాఫిక్ మరింత ఎక్కువగా ఉంటుంది. రెండు, మూడుసార్లు సిగ్నల్ పడితేనే గానీ జంక్షన్ దాటడానికి వీలుండని పరిస్థితి ఉంటుంది. అలాంటి రద్దీ సమయాల్లో భారీ వాహనాలు జాతీయ రహదారి మీదుగా రావడం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారుతోంది. అదేవిధంగా పక్క నుంచి వచ్చే వాహనాలను భారీ వాహనాల డ్రైవర్లు గుర్తించకపోవడం, సరిగా అంచనా వేయలేకపోవడం వంటి కారణాలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి మీదుగా రాకపోకలకు అవకాశం ఉంది కదా అని...భారీ వాహనాలు నగరంలోకి ఇష్టారాజ్యంగా

... మిగతా 6వ పేజీలో



ఇటీవల వెంకోజీపాలెం జంక్షన్ సమీపంలో టిప్పర్ ఢీకొనడంతో బోల్తాపడ్డ కారు



గురుద్వారా జంక్షన్ నుంచి మద్దిలపాలెంవైపు వెళుతున్న భారీ వాహనాలు

వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లకు వీర డిమాండ్

సగటున 150 శాతానికి పైగా ఆక్యుపెన్సీ

- షిర్డీ, కొల్లాం, గాంధీదామ్ ఎక్స్‌ప్రెస్‌లకు వందల్లోనే 'వెయిటింగ్'
- ...అయినా ఫ్రీక్వెన్సీ పెంపునకు ముందుకురాని రైల్వే పెద్దలు
- వాల్తేరు డివిజన్‌పై వివక్ష
- ఢిల్లీలో యత్నిస్తేనే ఫలితం
- ఉత్తరాంధ్ర ఎంపీలు ఆ దిశగా దృష్టిపెట్టాలని ప్రయాణికుల విజ్ఞప్తి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం నుంచి పలు దూర ప్రాంతాలకు నడుపుతున్న వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లకు విపరీతమైన డిమాండ్ ఉంటోంది. ఆక్యుపెన్సీ 150 శాతానికి మించి నమోదవుతోంది. ఎక్కడైనా ఇలా ఉంటే వారానికి ఒకసారి నడిపే వాటిని రెండు నుంచి మూడు రోజులకు పెంచి, ఆ తరువాత రెగ్యులర్‌గా నడిపేందుకు యత్నిస్తారు. కానీ వాల్తేరు రైల్వే డివిజన్‌లో పదేళ్లు గడిచిపోతున్నా వాటిని వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లుగానే ఉంచుతున్నారు. ఫ్రీక్వెన్సీ పెంచే ప్రయత్నాలు ఏమీ కనిపించడం లేదు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ విషయానికి వస్తే ఇక్కడి నుంచి ప్రయాణించే వారి సంఖ్య పరంగా గాని, ఆదాయం విషయంలో గాని అగ్రస్థానంలో ఉంటోంది. అయినా ఇక్కడి అవసరాలపై రైల్వే అధికారులు పెద్దగా దృష్టి సారించడం లేదు.

ఇవిగో ఆక్యుపెన్సీ లెక్కలు...

విశాఖపట్నం నుంచి వివిధ ప్రాంతాలకు నడుపుతున్న వీక్లీ రైళ్లు, వాటి ఆక్యుపెన్సీ వివరాలను సమాచార హక్కు చట్టం కింద ఓ వ్యక్తి సేకరించగా ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

- విశాఖపట్నం నుంచి 18503

... మిగతా 6వ పేజీలో



రైల్వే జోన్‌కు జీఎంను నియమించండి

పార్లమెంటులో ఎంపీ శ్రీభరత్



విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా జోన్‌కు తక్షణమే జనరల్ మేనేజర్‌ను నియమించాలని ఎంపీ శ్రీభరత్ కోరారు. పార్లమెంటులో మంగళవారం రైల్వే అంశాలపై చర్చ జరిగినప్పుడు ఆయన మాట్లాడారు. జోనల్ కార్యాలయానికి టెండర్లు పిలిచినందుకు కృతజ్ఞతలు చెబుతూ వాల్తేరు డివిజన్‌ను విశాఖపట్నం డివిజన్‌గా కొనసాగిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. దానికి కూడా కొత్త డీఆర్ఎంను నియమించాలన్నారు. సరకు రవాణా రైళ్ల వేగం సగటున గంటకు 50 కి.మీ. ఉండేలా చూడాలన్నారు. రవాణా సమయాన్ని తగ్గించగలిగితే లాజిస్టిక్స్ వ్యవహారాలు మరింత విస్తృతమవుతాయన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌తో ఏయూ కళకళ

ఆర్ట్స్ అండ్ సైన్స్ విద్యార్థులకు భారీ వేతనాలతో కూడిన ఉద్యోగాలు

- గడిచిన మూడు నెలల్లో సుమారు 900 మంది ఎంపిక
- రూ.మూడు లక్షల నుంచి రూ.15 లక్షల ప్యాకేజీ
- కంపెనీల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాల పెంపుతో సత్ఫలితాలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ పరిధిలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు భారీ వేతనాలతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గడిచిన మూడు నెలల్లో సుమారు 900 మంది రూ.3 లక్షల నుంచి రూ.15 లక్షల వార్షిక ప్యాకేజీలతో ఉద్యోగాలను సాధించారు. ఎంహెచ్ఆర్ఎం విద్యార్థి రూ.1.3 కోట్ల వార్షిక ప్యాకేజీతో పోలెండ్‌లో ఉద్యోగాన్ని పొందాడు. పరిశ్రమల/సంస్థల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించడం ద్వారా అవకాశాలను అందిపుచ్చుకుంటున్న వర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఇండస్ట్రీ మెంటార్‌షిప్, ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ వంటి ప్రోగ్రామ్స్‌ను అమలు చేస్తున్నారు.

90 శాతం మందికి ప్లేస్‌మెంట్స్

సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీ పరిధిలోని కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, స్టాటిస్టిక్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ జువాలజీ, బోటనీ, జియో ఫిజిక్స్ వంటి కోర్సులు పూర్తి చేసిన 710 మంది విద్యార్థులు గడిచిన మూడు నెలల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఎంపికయ్యారు. వీరికి నెలకు కనిష్ఠంగా రూ.3 లక్షల నుంచి గరిష్ఠంగా ఆరు లక్షల రూపాయల ప్యాకేజీ ఇచ్చేందుకు పలు సంస్థలు ముందుకువచ్చాయి. ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజీ పరిధిలోని ఎంబీఏ, ఎంహెచ్ఆర్ఎం, ఇంటర్నేషనల్ బిజినెస్, ఎంకాం, ఎకనామిక్స్, థియేటర్ ఆర్ట్స్, జర్నలిజం వంటి కోర్సులు పూర్తిచేసిన 280 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. వీరిలో ఎంహెచ్ఆర్ఎం పూర్తిచేసిన విద్యార్థి రూ.1.3 కోట్ల వేతనంతో

... మిగతా 6వ పేజీలో

లేటరైట్!?

భమిడికలొద్దిలో మళ్లీ తవ్వకాలకు రంగం సిద్ధం

- క్వారీ ప్రాంతానికి మిషనరీ, వాహనాలు
- తెర వెనుక కూటమి పార్టీ నేత
- స్థానికంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు
- బియ్యం కార్డుదారులకు నెలకు రూ.1,000 చొప్పున అందజేస్తామని హామీ

భమిడికలొద్ది లేటరైట్ క్వారీ (ఫైల్ ఫొటో)



విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సుందరకోట పంచాయతీ భమిడికిలొద్దిలో జర్తా లక్ష్మణరావుకు చెందిన క్వారీలో లేటరైట్ తవ్వకాలకు మళ్లీ రంగం సిద్ధమైంది. ప్రభుత్వంలో కీలక వ్యక్తి తెర వెనుక ఉండగా, నర్సీపట్నానికి చెందిన వ్యాపారి తవ్వకాల బాధ్యత తీసుకున్నారు. లేటరైట్‌ను తవ్వి తరలించేందుకు వీలుగా భమిడికలొద్ది క్వారీ నుంచి కాకినాడ జిల్లా రౌతులపూడి వరకూ రహదారిని గత పక్షం రోజుల నుంచి మరమ్మతు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం క్వారీ పాయింట్ వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారనే ప్రచారం సాగుతుంది. తవ్వకాలకు అవసరమైన మిషనరీని

... మిగతా 6వ పేజీలో

సరుగుడు లేటరైట్‌పైనా కూటమి నేతల కన్ను?

- 40 హెక్టార్లల్లో తవ్వకాలకు ఈసీ అనుమతి
- తెర వెనుక ఇద్దరు నేతలు

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండలం సరుగుడు ప్రాంతంలో గల మేలు రకం లేటరైట్‌పై కూటమికి చెందిన కొందరు నేతల కన్నుపడింది. గిరిజనులకు మైనింగ్ లీజులు వచ్చేలా తెర వెనుక ఇద్దరు నేతలు చక్రం తిప్పారు. ఈ నేపథ్యంలో గత ఏడాది చివరిలో ఇద్దరికి లేటరైట్ తవ్వకాల నిమిత్తం కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు లభించాయి.ఈ విషయాన్ని ఇప్పటివరకూ అత్యంత గోప్యంగా ఉంచారు. విశ్వసనీయంగా అందిన వివరాల ప్రకారం...సరుగుడు గ్రామ పరిధిలో చెరో 20 హెక్టార్లలో తవ్వకాలకు ఇద్దరు గిరిజనులు దరఖాస్తు చేశారు. వాటిని గనుల శాఖ పరిశీలించి జిల్లా యంత్రాంగం ద్వారా ప్రభుత్వానికి పంపగా...అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖల కమిటీలు పరిశీలించి ఆమోదం తెలిపాయి.

లేటరైట్ తవ్వకాలకు అనుమతులు

నర్సీపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండలం సుందరకోట పంచాయతీ భమిడికలొద్ది, సరుగుడు ప్రాంతాల్లో లేటరైట్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని మైనింగ్ ఏడీ శివాజీ తెలిపారు. మంగళవారం తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ భమిడికలొద్ది క్వారీ జర్తా లక్ష్మణరావు పేరు మీద ఉందన్నారు. మొత్తం 121 హెక్టార్లలో తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని తెలిపారు. అలాగే సరుగుడులో కిల్లో లోవరాజు పేరుతో 20 హెక్టార్లలో లేటరైట్ తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని శివాజీ తెలిపారు.

నేడు టీడీపీలో వైసీపీ కార్పొరేటర్లు చేరిక

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి: టీడీపీలో వైసీపీ కార్పొరేటర్ల చేరిక వాయిదా పడింది. వైసీపీకి చెందిన ఎనిమిది మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు సోమవారం సాయంత్రం ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్‌తో కలిసి విజయవాడ వెళ్లారు. మంగళవారం ఉదయం మంత్రి నారా లోకేష్ సమక్షంలో వారంతా టీడీపీ కండువాలు కప్పుకోవాల్సి ఉంది. అయితే మంత్రి బిజీగా ఉండడంతో చేరికల కార్యక్రమాన్ని బుధవారం ఉదయానికి వాయిదా వేశారు. టీడీపీలో చేరేందుకు వైసీపీకి చెందిన కెల్ల సునీత, గేదెల లావణ్య, ముర్రు వాణి, భూపతిరాజు సునీత సోమవారం విజయవాడ వెళ్లారు. వీరితోపాటు మరో నలుగురు కార్పొరేటర్లు కూడా విజయవాడ వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే వారెవరనే సమాచారాన్ని టీడీపీ వర్గాలు గోప్యంగా ఉంచుతున్నాయి. ఇదిలావుండగా మరో ముగ్గురు వైసీపీ కార్పొరేటర్లు రెండు, మూడు రోజుల్లో జనసేనలో చేరతారని ప్రచారం జరుగుతోంది. తమ కార్పొరేటర్లను కాపాడుకునేందుకు వైసీపీ నేతలు ఇప్పటికే రంగంలోకి దిగి వారికి హామీలు ఇచ్చే పనిలో పడ్డారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.11 (బుధవారం సాయంత్రం)

సహర్ : 4.45 (గురువారం ఉదయం)

గుర్రంపాలెంలో అక్రమ క్వారీయింగ్

నోటీసులకే పరిమితమైన గనుల విజిలెన్స్ విభాగం

- జరిమానా విధించడంపై మీనమేషాలు
- పెద్దల జోక్యమే కారణం

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌లో అక్రమంగా క్వారీయింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలో గనుల శాఖ విజిలెన్స్ విభాగం మీనమేషాలు లెక్కించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పర్మిట్లు తీసుకోకుండా గ్రావెల్/మట్టి తవ్వినందుకు ఎనిమిది మందికి నోటీసులు ఇచ్చిన విజిలెన్స్ అధికారులు తరువాత జరిమానా విధించడానికి వెనుకంజ వేశారనే వాదన వినిపిస్తోంది. కూటమికి చెందిన కీలక నేత ఒకరు జోక్యం చేసుకోవడంతోనే అధికారులు మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



గుర్రంపాలెం క్వారీ


చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐఐసీ ఐదేసి ఎకరాల ప్లాట్లతో లేఅవుట్ రూపొందించింది. వాటిని పలువురు పారిశ్రామికవేత్తలకు కేటాయించింది. ఆ అనువుగా ప్లాట్లు అభివృద్ధి చేసుకునేందుకు

... మిగతా 6వ పేజీలో

మెట్రో రైలు మొబిలిటీ ప్లాన్‌కు రూ.84.47 లక్షలు

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి మొబిలిటీ ప్లాన్ రూపొందించడానికి కేంద్ర అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం రూ.71.58 లక్షలు మంజూరు చేసింది. దీనికి సిస్ట్రా ఎంవీఏ సంస్థను కన్సల్టెన్సీగా ఎంపిక చేశారు. వారికి 18 శాతం జీఎస్‌టీతో కలుపుకొని రూ.84.47 లక్షలు చెల్లిస్తారు. ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతాయి.

బ్రెయిన్ స్ట్రోక్ బాధితులు... మానసిక ఒత్తిడి



- సమస్య బారినపడి కోలుకుంటున్న వారిని వేధిస్తున్న అనేక ఇబ్బందులు
- ఏయూ సైకాలజీ విద్యార్థి పరిశోధన

-8లో

బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆనందపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో డాక్టర్ వి.జానకి తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కల్పనలో భాగంగా వివిధ కులాల్లో అర్హత కలిగిన వారు చంద్రన్న స్వయం ఉపాధి పథకం-2025లో ఆర్థిక సహాయం అందించేందుకు ఆన్‌లైన్‌లో ఏపీఓబీఎంఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. చంద్రన్న స్వయం ఉపాధి పథకం ద్వారా వెనుకబడిన తరగతుల లబ్ధిదారులకు 50 శాతం రాయితీ, 50 శాతం బ్యాంక్ లోనుగా ఆర్థిక సహాయం ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.బీసీ కాపు, ఈడబ్ల్యూఎస్ లబ్ధిదారులకు వ్యవసాయ- అనుబంధ పరిశ్రమలు, రవాణా, పరిశ్రమలు, సేవలు వ్యాపార రంగాల్లో స్వయం ఉపాధి పథకాలు, జెనరిక్ ఫార్మశీలు బి-ఫార్మశీ, డి-ఫార్మశీ కేటగిరీలకు చెందిన నిరుద్యోగ యువత, కులవృత్తుల్లో నిమగ్నమై ఉన్న మేదర, కుమ్మరి, శాలివాహన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. పై కేటగిరీలలో అర్హత కలిగిన లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సంబంధిత సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఈడబ్ల్యూఎస్ 16, బీసీ ఫార్మసీ 3, ఈడబ్ల్యూఎస్ ఫార్మసీ 3, చంద్రన్న స్వయం ఉపాధి స్కీం (కాపు) 15 యూనిట్లు ఏర్పాటు చేసేందుకు టార్గెట్స్ నిర్ణయించడమైందన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

మినీ వ్యాన్ల స్టాండ్ ప్రారంభం

తగరపువలస, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస శివాలయం ఎదుట ఖాళీస్థలంలో మినీ వ్యాన్ల స్టాండును సీఐటీయూ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మంగళవారం ప్రారంభించారు. తగరపువలస కూడలిలో స్థలం లేనందువల్ల కొత్తగా ఈ స్థలంలో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గుర్తించామని అన్నారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ మోటార్ వెహికల్ చట్టంలో మార్పులు చేయవలసిన అవసరం ఉందని, ఫీజులపై పెట్టిన షరతులను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరారు. వాహనాల సిబ్బందిపై బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసుల వేధింపులు నిలుపుదల చేయాలని, మోటారు కార్మికులకు కనీస సభద్రతను కల్పించి ఇంటి స్థలాలను కేటాయించాలని కోరారు. తగరపువలస మోటారు వాహనాల నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. ఎస్.వెంకటరత్నం అధ్యక్షుడుగా వై.సూరిబాబు ప్రధాన కార్యదర్శిగా, ఆర్.అప్పలరాజు కోశాధికారిగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు ఎస్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

జిల్లా న్యాయ సేవాసాధికార సంస్థ ప్రతినిధి న్యాయమూర్తి వరలక్ష్మి

సింహాచలం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో చెడును ధైర్యంగా ప్రతిఘటించాలంటే విద్యార్థి దశ నుంచే చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాసాధికార సంస్థ ప్రతినిధి న్యాయమూర్తి ఎస్.వరలక్ష్మి అన్నారు. అడవివరం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోక్సో చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలలపై అఘాయిత్యాలను నిరోధించేందుకు పోక్సో చట్టం ఉపకరిస్తుందన్నారు. విద్యార్థులు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను కావాల్సిన అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో గోపాలపట్నం ఎస్ఐ డి.అప్పలనాయుడు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కేవీ రాజేశ్వరి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కుర్రపల్లిలో సినిమా షూటింగ్

పద్మనాభం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధి కుర్రపల్లిలోని ఒక ఇంటి వద్ద మంగళవారం వేసిన పోలీస్ స్టేషన్ సెట్‌లో సినిమా షూటింగ్ జరిగింది. అనఘాదేవి మూవీస్ బ్యానర్‌పై వెంకట్ పంపన దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించి పలు దృశ్యాలను చిత్రీకరించారు. ఈ బ్యానరుపై 'ఒక్కడే వీరుడు అల్లూరి సీతారామరాజు' అనే సినిమాను ఇదే గ్రామానికి చెందిన నిర్మాత రాజా సాగి సత్యనారాయణరాజు (కుర్రపల్లిబాబు) నిర్మించారు. ప్రస్తుతం 'పాన్ ఇండియా' అనే టైటిల్‌తో ఈ సినిమాను పద్మనాభం మండల పరిసరాల్లో చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాలో హీరోగా నూతన నటుడు రోహన్, హీరోయిన్‌గా హారిక నటిస్తున్నారు.

78వ వార్డులో సీపీఎం ప్రజా చైతన్య యాత్ర

కొమ్మాది, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి కే2 కాలనీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి 78వ వార్డు కార్పొరేటర్ గంగారాం డిమాండ్ చేశారు. సీపీఎం నిర్వహిస్తున్న ప్రజా చైతన్యయాత్రలో భాగంగా మంగళవారం కే2 కాలనీలో మధురవాడ ప్రాంత నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసులకు కనీసం తాగునీటి సదుపాయం లేదని, కనీస వసతులు ఇక్కడ కొరవడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు డి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహం నిర్మాణానికి రూ.4.5 కోట్లు మంజూరు : ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : భీమిలి డైట్ జంక్షన్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం నూతన భవన నిర్మాణానికి రూ. 4.50 కోట్లు నిధులు మంజూరైనట్టు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ఈ భవనం నిర్మించడంతో శిథిలస్థితికి చేరిందన్నారు. ప్రస్తుతం ఈ భవనంలో సాంఘిక సంక్షేమ శాఖ కాలేజి బాయ్స్ హాస్టల్‌ను నిర్వహిస్తోంది. శ్లాబ్ నుంచి పెచ్చులు రాలిపడడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రమాద పరిస్థితిని గుర్తించి సంబంధిత హాస్టల్ విద్యార్థులను నూకాలమ్మ గుడి వద్దనున్న వార్డు సచివాలయం పై అంతస్థులోకి తాత్కాలికంగా మార్చినట్టు తెలిపారు. అయితే, పాత భవనంలోనే భోజనం ఏర్పాటు చేసి, సమీపంలోనే ఉన్న సచివాలయం పై అంతస్థులోకి వెళ్లి చదువుకోవడం,



శిథిల స్థితిలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం

నిద్రించడం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి సంబంధిత నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు కోరుతూ ప్రతిపాదనలు పంపించామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకుని ఈ నిధులు మంజూరు చేయించారన్నారు. సంబంధిత ఎస్సీ బాలుర హాస్టల్‌లో వంద మంది విద్యార్థులు ఉంటున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. నిధులు కేటాయించిన విషయాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా వీరాంజనేయ స్వామి తనకు లేఖ ద్వారా తెలిపారన్నారు. హాస్టల్ నూతన భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆ లేఖలో మంత్రి కోరినట్టు ఎమ్మెల్యే తెలిపారు. గత అయిదేళ్లలో జాడ లేకుండా పోయిన అభివృద్ధి నియోజకవర్గంలో మంజూరవుతున్న నిధులు పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరులో సహకారం అందించినందులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

పీఎఫ్ కార్యాలయం ఎదుట చిట్టివలస జూట్ మిల్లు పింఛనుదారుల ఆందోళన

తగరపువలస, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్ మిల్లు పింఛనుదారులు సం ఘం ఆధ్వర్యంలో పెన్షనర్లు మంగళవారం చేపట్టిన 'చలో విశాఖ పీఎఫ్ కార్యాలయం' కార్యక్రమం విజయవంతం అయినట్టు సంఘ ప్రతినిధులు తెలిపారు. చిట్టివలస తగరపువలస తదితర ప్రాంతాలకు చెందిన జూట్ మిల్లు పింఛనుదారులుఉదయం విశాఖనగరలోని పీఎఫ్ కార్యాలయాన్ని చేరుకుని నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఈ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, జిల్లా కార్యదర్శి షేక్ హుస్సేన్‌లు ప్రత్యేకం గా విచ్చేశారు.. ఆ నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పింఛనుదారుల పట్ల వ్యవహరిస్తున్న వ్యతిరేక విధానాలను వివరించారు. చిట్టివలస నుంచి పింఛనుదారుల



విశాఖ పీఎఫ్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న చిట్టివలస పింఛనుదారులు

సంఘానికి చెందిన దామోదర బాబాజీ, మోర అప్పలరాజు, అప్పారావు, పంపాన సూర్యనారాయణ, సింగిడి అప్పారావు తదితరులు హాజరై తమ సమస్యల ను వివరించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ప్లకార్డులు పట్టుకొని నినాదాల చేశారు. ఈ సందర్భంగా మోర అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక పింఛనుదారులకు రూ..వెయ్యి మాత్రం పింఛనుగా ఇస్తోందని, ఇది ఏ మాత్రం సరిపోదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస పింఛను రూ.9వేలు చేయాలని కోరారు. అలాగే పింఛనుదారులకు ప్రయాణాల్లో రాయితీలు కల్పించాలని రైల్వే రిజర్వేషన్లు రాయితీలు ఇవ్వాలని కోరారు. ఆరోగ్యశాలల్లో ఉచిత వైద్యాన్ని అందించాలన్నారు. తెల్లకార్డులు లేనివారికి సైతం వెంటనే ఆరోగ్యశ్రీ సేవలు అందించాలని కోరారు. చిట్టివలస నుంచి వాహనాలలో వెళ్లిన కార్మికులు ప్రాంతీలయ పీఎఫ్ కమీషనర్ కార్యాలయంలో తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అధికారులకు అందించారు.

అప్పన్న సన్నిధిలో స్వాతి నక్షత్ర హవనం

సింహాచలం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వాతి నక్షత్ర హవనాన్ని మంగళవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా పూర్తిచేశాక యజ్ఞమూర్తిగా సుదర్శన పెరుమాళ్‌ను కల్యాణ మండపంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన మండలంలో అధిష్ఠింపజేశారు. 34మంది ఉభయ దాతల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాదన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచరాలు సమర్పించారు. భక్తులకిచ్చిన రాగిమాడపై నృసింహ అష్టోత్తర శతనామావళితో పూజలు జరిపించారు. ఆగమోక్తంగా బింబారాధన, కలశారాధన, మండపారాధనలు జరిపారు. ఆలయ పోటునుంచి వృద్ధాగ్నిని తెచ్చి హోమకుండంలో అగ్ని ప్రతిష్ఠాపన గావించారు. పూర్ణాహుతి ద్రవ్యాలను భక్తులు స్పృశించాక మహా పూర్ణాహుతి చేసి ప్రధాన కలశాన్ని శిరస్సున దాల్చి బేడా మండప ప్రదక్షిణతో అంతరాలయంలోని మూలవిరాట్ వద్ద ఉంచి పూజలు జరిపారు. అందులోని పవిత్ర జలాలతో భక్తులను ప్రోక్షణ గావించారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు ప్రసాదాలను



అప్పన్న ఆలయ కల్యాణ మండపంలో హవనం చేస్తున్న రుత్విక్‌లు

అందజేశాక అంతరాలయంలో స్వామి వారి దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు దంపతులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ దంపతులు పాల్గొన్నారు. హవనం ఏర్పాట్లను ఏఈఓ ఎస్.ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి ప్రసాద్ పర్యవేక్షించారు.

నూకాలమ్మ ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

27న తొలేళ్లు, 28న అనుపోత్సవం | ముస్తాబైన్న అమ్మవారి ఆలయం

భీమునిపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భీమిలి గ్రామ దేవత శ్రీనూకాలమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయాన్ని శోభాయమానంగా ముస్తాబు చేస్తున్నారు. ఇటీవల అమ్మవారి ప్రతిరూపమైన తంగేటి పూలగరగను భక్తులు ఊరేగింపుగా తీసుకువచ్చి మునిసిపల్ లాల్‌బహదూర్‌శాస్త్రి మార్కెట్ ఆవరణలో ఉన్న అమ్మవారి చదురుపట్టు వద్దకు తెచ్చారు. కాగా ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నూకాలమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. 27వ తేదీ రాత్రి తొలేళ్ల ఉత్సవంలో అమ్మవారి ప్రతిరూపమైన తంగేటి పూలగరగను నేలవేషాలు, బండ్ల వేషాలు, బాణసంచా కాల్పుల నడుమ తిరిగి ఆలయానికి తెస్తామన్నారు. రెండు వారాల పాటు అమ్మవారు చదురుపట్టు వద్దే ఉంటారు. అక్కడే అర్చకులు పూజలు చేస్తారు. 28న అమ్మవారి అనుపోత్సవాన్ని, 29న పేరంటాలు పాపమ్మ



నూకాలమ్మ ఆలయానికి రంగులు వేస్తున్న దృశ్యం



అమ్మవారి ప్రతిరూపం పూలగరగ

ఉత్సవాన్ని, 30న పేరంటాలు దుడ్డు అచ్చియ్యమ్మ ఉత్సవాన్ని జరుపుతామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు అల్లిపిల్లి వేణుబాబు, వై.హరి, పి.ఎర్రయ్యరెడ్డి, పి.వినోద్‌కుమార్, జి.సన్యాసిరావులు తెలిపారు.

విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

16వ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ



ఓపెన్ దర్బార్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

కొమ్మాది, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అన్నారు. బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో ఓపెన్ దర్బార్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో సిబ్బంది అనుసరించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు. అనంతరం ఆయుధ పరిశీలన చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

మాడవీధిలో కలకలం సృష్టించిన పాము

సింహాచలం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సింహగిరి మాడవీధిలో పాము కనిపించడంతో ఒక్కసారిగా భక్తులు భయంతో పరుగులు తీశారు. మంగళవారం ఉదయం అప్పన్నస్వామి ఆలయ ప్రధాన రాజగోపురం ఎదురుగా కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద ఫుట్‌పాత్‌పై ఉంచిన మొక్కను చుట్టుకుని పాము కనిపించింది. చాల సేపు మొక్కలపైనే పాకుతూ పాము ముందుకు కదలడంతో భక్తులంతా ఆందోళనకు గురయ్యారు. ఆ తరువాత కాసేపటికి చెట్లపైకె పాము వెళ్లిపోవడంతో అందరూ ఊపిరి తీసుకున్నారు.



మొక్కపై ఉన్న పాము

క్యాన్సర్‌పై అవగాహన

ఆనందపురం,మార్చి 18(ఆంధ్రజ్యోతి): వేములవలస కేఎస్ఆర్ హోటల్‌లో గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో గొంతు, ప్రొస్టేట్ క్యాన్సర్ల వ్యాధి పట్ల మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సంద ర్భంగా హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు వీఎస్ శరత్ చందు, కె.ఫణిశేఖర్ మాట్లాడుతూ 60 ఏళ్ల పైబడిన పురుషులకు తరచూ మూత్రవిసర్జనలో మంట, తక్కువ విసర్జన, నొప్పి ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించి తనిఖీలు చేయించుకోవాలన్నారు. 40 ఏళ్లు పైబడిన మహిళలకు తరచూ రక్తస్రావణం జరిగినా వైద్యులను సంప్రదించాలని కోరారు. ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపకుడు జంగం జోషి, జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, రిటైర్డు పారామెడికల్ అధికారి నరేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌తో ఏయూ కళకళ

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగాన్ని సాధించాడు. మిగిలిన విద్యార్థులు రూ.4.5 లక్షల నుంచి తొమ్మిది లక్షల వేతనాలను పొందారు. అలాగే, ఫార్మసీ కాలేజీ పరిధిలోని 48 మంది నాలుగు లక్షల నుంచి ఆరు లక్షల రూపాయల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. వీరికి ఉద్యోగాలు కల్పించిన సంస్థల్లో ఫైజర్, డాక్టర్ రెడ్డీస్, లారస్, అరబిందో, సత్యరాక్స్ వంటివి ఉన్నాయి. న్యాయ విద్య పూర్తిచేసిన విద్యార్థులు భారీ వేతనాలతో ఉద్యోగాలు సాధించారు. ఇప్పటివరకూ పది మంది విద్యార్థులు మూడు లక్షల నుంచి ఏడు లక్షల రూపాయల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. వీరిలో ఎనిమిది మంది ప్రముఖ సంస్థ లీగల్ ఫోరంలో చేరగా, ఇద్దరు శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్‌లో లీగల్ అడ్వయిజర్స్‌గా చేరారు. స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌కు చెందిన 12 మంది విద్యార్థులు రూ.4 లక్షల నుంచి రూ.7 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. పలు సంస్థల్లో మార్కెటింగ్, బిజినెస్ అనలిటిక్స్ విభాగాల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

నిరంతరం టచ్‌లో ఉంటూ క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నాం

- వీఆర్ రెడ్డి, ప్లేస్ మెంట్ ఆఫీసర్, సౌత్ క్యాంపస్ ఏయూ

వర్సిటీలోని వివిధ కోర్సులు చేసిన విద్యార్థుల వివరాలు,



వారిలో ఉన్న నైపుణ్యాలతో కూడిన జాబితా రూపొందించుకుని నిరంతరం కార్పొరేట్ కంపెనీలతో టచ్‌లో ఉంటున్నాం. ఆయా సంస్థలకు అవసరమైన మానవ వనరుల గురించి మాకు సమాచారాన్ని అందించిన వెంటనే ఇంటర్వ్యూల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. పరిశ్రమలు, సంస్థలు అవసరాలకు అనుగుణంగా స్కిల్స్ నేర్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ఇందుకోసం కొన్నాళ్ల కిందట ప్రవేశపెట్టిన ఇండస్ట్రీ మెంటార్‌షిప్, ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వీటివల్ల పరిశ్రమల అవసరాలపై విద్యార్థులకు ఒక అవగాహన కలుగుతోంది. గతంతో పోలిస్తే ఆర్ట్స్ అండ్ సైన్స్ విద్యార్థులు భారీ వేతనాలతో ఉద్యోగాలను సాధిస్తున్నారు.

గుర్రంపాలెంలో అక్రమ క్వారీయింగ్

... 5వ పేజీ తరువాయి

భారీగా గ్రావెల్/మట్టి అవసరమైంది. అందుకు గనుల శాఖ నుంచి తాత్కాలిక పర్మిట్లు తీసుకోవాలి. కానీ అటువంటిదేమీ లేకుండా సమీపంలో గల కొండల నుంచి భారీస్థాయిలో గ్రావెల్/మట్టి తవ్వి ప్లాట్లు చదునుకు తరలించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురితం కావడంతో గనుల శాఖ, గనుల శాఖ విజిలెన్స్ అధికారులు పలుమార్లు తనిఖీలు చేశారు. గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌లో అక్రమ క్వారీయింగ్ ప్రాంతం, ఫిల్ చేసిన ప్లాట్లు పరిశీలించారు. ఈ వ్యవహారంలో గనులశాఖ విజిలెన్స్ అధికారులు సుమారు ఎనిమిది మందికి నోటీసులు జారీచేశారు. ఎంత మేర గ్రావెల్, మట్టి తవ్వి తరలించారో కొలతలు వేసి...ఆ మేరకు జరిమానా విధించాలంటూ గనుల శాఖ రెగ్యులర్ విభాగానికి సిఫారసు చేయాలి. అయితే జరిమానా విధింపుపై ఇంత వరకూ విజిలెన్స్ నుంచి రెగ్యులర్ విభాగానికి ఎటువంటి సమాచారం అందలేదు. నేతల నుంచి వచ్చిన ఒత్తిళ్ల కారణంగానే జరిమానా విధించే నోటీసులు జారీచేయాలని సూచిస్తూ రెగ్యులర్ విభాగానికి ఎటువంటి లేఖ రాయలేదని ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

నేటి నుంచి పూర్తిస్థాయిలో ఇంటర్ మూల్యాంకనం

... 5వ పేజీ తరువాయి

పత్రాల మూల్యాంకనం సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. క్యాంప్ ఆఫీసర్, ఏసీవో, సీపీవో, కోడింగ్ అధికారులు స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం ఒకటో విడతలో తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మాథ్స్, సివిక్స్ జవాబుపత్రాల మూల్యాంకనం జరుగుతోంది. 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రెండో విడతలో ఫిజిక్స్, ఎకానమిక్స్, జీఎఫ్‌సీ, 24వ తేదీ నుంచి జరిగే మూడో విడత కెమిస్ట్రీ, హిస్టరీ, 26వ తేదీ నుంచి నిర్వహించే నాలుగో విడతలో కామర్స్, బోటనీ, జువాలజీ, బ్రిడ్జ్ కోర్సు జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తారు. విధులకు హాజరయ్యే ఎగ్జామినర్ల సంఖ్యను బట్టి ఈ నెల 31 లేదా ఏప్రిల్ రెండో తేదీ నాటికి ప్రక్రియను పూర్తిచేస్తామని ఆర్ఐవో తెలిపారు. ప్రథమ, ద్వితీయ పరీక్షా ఫలితాలను ఇంటర్ బోర్డు ఏప్రిల్ రెండో వారంలో విడుదల చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.

భారీ వాహనాలతో బెంబేలు

... 5వ పేజీ తరువాయి

వచ్చివెళుతున్నాయి. దీనివల్ల నగర అంతర్గత రోడ్లపై వాహనాల రాకపోకలకు ఆటంకం ఎదురవుతోంది.

కొత్త జాతీయ రహదారిపైకి మళ్లించాలి

నగరంలో భారీ వాహనాల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్రం కొత్త జాతీయ రహదారిని అందుబాటులోకి తెచ్చింది. అనకాపల్లి నుంచి పెందుర్తి మీదుగా ఆనందపురం జంక్షన్‌లో ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిని కలుపుతూ కొత్త రహదారిని నిర్మించింది. దీనివల్ల ఒడిశా, శ్రీకాకుళం వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించకుండా ఆనందపురం వద్ద నుంచి పెందుర్తి మీదుగా అనకాపల్లి వైపు వెళ్లేందుకు అవకాశం ఉంది. అలాగే చెన్నై, విజయవాడ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు నగరంలోకి రాకుండా అనకాపల్లి నుంచి పెందుర్తి మీదుగా ఆనందపురం వైపు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా భారీ వాహనాలు నగరంలోని ట్రాఫిక్ ఇబ్బందులను తప్పించుకుని సాఫీగా ప్రయాణం సాగించవచ్చు. అదేసమయంలో నగరంలో కూడా భారీ వాహనాల తాకిడి తగ్గి, ట్రాఫిక్ సమస్యతోపాటు రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుతాయని అంతా భావించారు. కానీ కొత్త జాతీయ రహదారిపై రెండు టోల్‌గేట్‌లు ఉండడంతో వాటిని తప్పించుకునేందుకు భారీ వాహనాలు నగరం మధ్య నుంచి ఉన్న జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీనివల్ల కొత్త జాతీయ రహదారి నిర్మాణ లక్ష్యం నెరవేరకుండా పోయినట్టయింది. మరోవైపు నగరంలో ట్రాఫిక్ సమస్య యథావిధిగా కొనసాగుతోంది. నగరంలోకి భారీ వాహనాల రాక వల్ల కలుగుతున్న ఇబ్బందులు, జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని వాటిని కొత్త జాతీయ రహదారిపైగా మళ్లించేందుకు నగర పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుం టున్నారు.

లేట 'రైట్'!?

... 5వ పేజీ తరువాయి

కొండపైకి చేర్చారంటున్నారు. ఈ వారంలో రహదారి మరమ్మతులు పూర్తిచేసిన తరువాత తవ్వకాలు ప్రారంభించాలని భావిస్తున్నట్టు తెలిసింది.

భమిడికలొద్దిలో 121 హెక్టార్లలో లేటరైట్ తవ్వకాలకు వైసీపీ ప్రభుత్వ హయాంలో అల్లూరి జిల్లా కొయ్యూరు మండలానికి చెందిన గిరిజనుడు జర్తా లక్ష్మణరావు పేరిట అనుమతులు వచ్చాయి. అయితే లక్ష్మణరావు బినామీ మాత్రమే. ఆయన్ను ముందుపెట్టి వైసీపీకి చెందిన కీలక నేత కుమారుడు లేటరైట్ తవ్వకాలు చేపట్టారు. భమిడికలొద్దిలో క్వారీయింగ్, అక్కడ నుంచి రౌతులపూడి వరకు రహదారి నిర్మించిన ప్రాంతంపై అనేక వివాదాలు ఉన్నాయి. రిజర్వు అటవీ ప్రాంతంలో వేలాది చెట్లు కొట్టేసి రోడ్డు నిర్మించారు. దీనిపై నాతవరం మండలానికి చెందిన మరిడయ్య ఎన్జీటీలో ఫిర్యాదు చేయడతో విచారణ జరిగింది. ఒకపక్క విచారణ జరుగుతుండగానే పాలకుల దన్నుతో లేటరైట్‌ను తవ్వేసి లక్షల క్యూబిక్ మీటర్లు తరలించుకుపోయారు. క్వారీ ప్రాంతంలో ఇప్పటివరకూ ఎంత తవ్వారు?, రాయల్టీ ఎంత చెల్లించారు?...అన్న విషయాలు గనుల శాఖ ఎన్నడూ వెల్లడించలేదు. గత ఏడాది ఎన్నికల ముందు తవ్వకాలు ఆపారు. అప్పటికే రౌతులపూడిలో నిల్వ చేసిన లక్షల క్యూబిక్ మీటర్ల లేటరైట్‌ను ఇటీవల కొందరు ఇతర ప్రాంతాలకు తరలించారు. ఇంకా రౌతులపూడి మండలంలో మరో రెండుచోట్ల ఉన్న నిల్వలను కొద్దిరోజుల నుంచి రాత్రిపూట తరలిస్తున్నారు.

ఇదిలావుండగా ప్రభుత్వం మారడంతో లేటరైట్ తవ్వకాల నుంచి వైసీపీ కీలక నేత కుమారుడు తప్పుకోగా, ప్రస్తుతం కూటమిలో ఉన్న పార్టీకి చెందిన మరో నాయకుడు రంగంలోకి దిగారు. లీజుదారుడు జర్తా లక్ష్మణరావుకు బినామీగా నర్సీపట్నానికి చెందిన వ్యాపారిని తెరపైకి తీసుకువచ్చారు.

భమిడికలొద్ది క్వారీ ఉన్న సుందరకోట పంచాయతీలో ప్రజల నుంచి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంచాయతీలో సుందరకోట, భమిడికలొద్ది, హసనగిరి, తొరడ, ముంత మామిడిలొద్ది, పాత సిరిపురం, కొత్త సిరిపురం గ్రామాల ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా చూసుకునే బాధ్యతను స్థానిక నేతలకు అప్పగించారు. ఎనిమిది గ్రామాల పరిధిలో మొత్తం 500 వరకు బియ్యం కార్డుదారులుండగా ప్రతి కార్డుదారుడికి నెలకు రూ.1000 వంతున పరిహారం అందజేస్తామని హామీ ఇస్తున్నట్టు తెలిసింది.

వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లకు వీర డిమాండ్

... 5వ పేజీ తరువాయి

నంబరుతో షిర్డీకి 2012లో వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి మధ్య ఆ రైలు ఆక్యుపెన్సీ 167.72 శాతం నమోదైంది. 2024 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 165.21 శాతం ఆక్యుపెన్సీ ఉంది.

● విశాఖపట్నం నుంచి 18567 నంబరుతో కొల్లాంకు 2014లో వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభించారు. ఈ రైలుకు 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 164.41 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది. 2024 ఏప్రిల్ నుంచి వరకు 163.98 శాతం ఆక్యుపెన్సీ ఉంది.

● విశాఖ నుంచి 20803 నంబరుతో గాంధీధామ్‌కు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను 2014లో ప్రారంభించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు దీని ఆక్యుపెన్సీ 107.94 శాతం ఉండగా, 2024 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 179.07 శాతం నమోదైంది.

● విశాఖపట్నం నుంచి 22801 నంబరుతో చెన్నై సెంట్రల్‌కు నడుపుతున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు 2023-24 ఆర్థిక సంవత్సరంలో 138.8 శాతం, 2024 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 139.92 శాతం ఆక్యుపెన్సీ వచ్చింది.

ఈ మార్గాల్లో వెయిటింగ్ లిస్ట్ జాబితా 227 నుంచి 805కు పెరిగింది. ఈ మార్గాల్లో ఎంత డిమాండ్ ఉందో చెప్పడానికి ఈ లెక్కలే నిదర్శనం.

విచిత్రంగా ఈ రైళ్లన్నీ విశాఖ నుంచి ఆయా గమ్యస్థానాలకు వెళ్లి ఆ మరుసటిరోజే అక్కడి నుంచి తిరిగి బయలుదేరుతున్నాయి. ఆయా నగరాల నుంచి రైలులో విశాఖపట్నం వెనక్కి రావాలంటే మళ్లీ ఈ రైలు వెళ్లేంత వరకు వారం రోజులు ఆగాల్సిందే. లేదంటే వేర్వేరు రైళ్లు మారాల్సి ఉంటుంది. రైలులో వెళ్లి అటు నుంచి విమానంలో వద్దామన్నా...షిర్డీ, గాంధీధామ్‌ల నుంచి ఆ సౌకర్యం కూడా లేదు. అందుకని వారానికి కనీసం రోజు తప్పించి రోజు ఈ రైళ్లు నడిపేలా చూడాలని విశాఖపట్నం రైలు వినియోగదారుల సంఘం తూర్పు కోస్తా రైల్వే అధికారులను కోరుతోంది.

ఢిల్లీలో ప్రయత్నిస్తేనే పచ్చజెండా

ఈ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లను వారానికి మూడు రోజులు నడిపేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ గత కొన్నాళ్లుగా వాల్తేరు డివిజన్ అధికారులు ప్రతిపాదనలు పెడుతున్నారు. అయితే ఈ రైళ్లు ఎక్కడికైతే వెళుతున్నాయో ఆ ప్రాంతానికి చెందిన రైల్వే జోనల్ అధికారులు కూడా దీనికి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. వీటికి సౌత్ సెంట్రల్, సౌత్ వెస్టర్న్ జోన్ అధికారులు అంగీకరించడం లేదని సమాచారం. వీటిపై అధికారులపరంగానే కాకుండా రాజకీయపరమైన ఒత్తిడి ఢిల్లీలో పెడితేనే పని జరుగుతుంది. ఉత్తరాంధ్ర ఎంపీలు ఆ రకమైన ప్రయత్నాలు చేయాల్సి ఉంది.

జగన్‌ను చూసి భయపడుతున్న రాష్ట్ర ప్రభుత్వ నేతలు

వైసీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

పద్మనాభం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి రాష్ట్ర ప్రభుత్వ నాయకులు భయపడుతున్నారని భీమిలి వైసీపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు.మంగళవారం పద్మనాభంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధిపై జగన్‌మోహన్‌రెడ్డి తప్పులు ఎత్తి చూపిస్తారనే భయంతోనే ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా కూటమి నాయకులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు.

నేడు జోన్-8లో తాగునీటి సరఫరాకు అంతరాయం

వెంకోజీపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-08 పరిధిలో వివిధ ప్రాంతాలకు వెళ్లే పైపులైను మరమ్మతులకు గురైనందున బుధవారం ఆయా ప్రాంతాల ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాపురం హెడ్ వాటర్ వర్క్స్ పంప్ హౌస్‌లో గల పంపుసెట్లు మరమ్మతుకు గురవడంతో బుధవారం తాగిపూడి ప్రధాన పైప్‌లైన్ పైన ఉన్న బల్క్ (రెసిడెన్షియల్)/ ఇండస్ట్రీస్ నీటి వినియోగదారులు, జోన్-8 పరిధిలో ఉన్న వార్డు 93(పి) నుంచి వార్డు 98లో గల ప్రాంతాలు, సాయిదుర్గానగర్, దుర్గానగర్, కృష్ణానగర్, అప్పలనరసింహం కాలనీ, వెంకట సాయినగర్, బంటా కాలనీ, రవినగర్ లక్ష్మీపురం, పోర్టు కాలనీ, రామ కో-ఆపరేటివ్ కాలనీ, హెచ్‌బీ కాలనీ, గోకుల్దాం కాలనీ, రెల్లివీధి, కృష్ణరాయపురం, గొల్లివిల్లివాని పాలెం, ఎల్‌ఐసీ కాలనీ, సుజాతనగర్, వాపయ్య రాజుపాలెం, పెందుర్తి పాత గ్రామం, తెలకలవీధి, జెడ్పీ హెచ్‌ఎస్ ఏరియా, ప్రశాంతి నగర్, క్రాంతి నగర్, వుడా కాలనీ, రైల్వే కాలనీ, సావిత్రి నగర్, అప్పన్నపాలెం, సింహపురి లేఅవుట్, అడవివరం, ఎస్సీకాలనీ, పాత అడవివరం, తదితర ప్రాంత్రాలో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

28న డాక్ పెన్షన్ అదాలత్

ఎంవీపీ కాలనీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 28న ఎంవీపీ కాలనీలోని ఆర్ఎంఎస్ వీ డివిజన్‌లో డివిజనల్ స్థాయిలో 103వ డాక్ పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్టు కార్యాలయం సూపరింటెడెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పదకొండు గంటల నుంచి ఆర్ఎంఎస్ పోస్టల్ సర్వీస్, పెన్షన్‌లకు సంబంధించిన ప్రజా ఫిర్యాదులు, నేరుగా ఫిర్యాదులు పరిష్కరించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారు. మెయిల్స్, స్పీడ్ పోస్టు, పార్శిల్స్, మనీ ఆర్డర్లు వంటి అన్ని సమస్యలతో వినియోగదారులు రావచ్చని ప్రకటనలో పేర్కొన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పరిధిలోని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. ఫిర్యాదులను ఈ నెల 15వ తేదీలోగా 'ఆర్ఎంఎస్ డాక్ పెన్షన్ అదాలత్ పేరుతో అడ్మినిస్ట్రేటివ్ కాంప్లెక్స్, ఎంవీపీ బస్ డిపో, ఎంవీపీ కాలనీ, విశాఖపట్నం 530 017' చిరునామాకు పంపించాలన్నారు.

మైండ్‌ఫుల్‌నెస్ ద్వారా ఒత్తిడి దూరం

సాగర్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మైండ్‌ఫుల్‌నెస్ అనేది ఆలోచనలను నియంత్రించుకోవడమే కాకుండా ఒత్తిడులు, ఏకాగ్రతను పెంచుకోవడానికి శక్తివంతమైన సాధనం అని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నిరంతర విద్యావిభాగం శిక్షకుడు, ప్లేఫుల్ మైండ్‌ఫుల్‌నెస్ గ్రంధరచీయిత ఎడ్వర్డ్‌రెనేడె స్మినర్స్ పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **కోర్ట్ :** సంగం, శ్రీ వెంకటేశ్వర-1, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి),
- **దిల్‌రుబా :** జగదాంబ, శ్రీకన్య, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర,
- **మజాకా :** రమాదేవి, శ్రీరామా, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, కామేశ్వరి, కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు)40, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 30, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 24 దొండకాయలు 34, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది)50, బరబాటి 34, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 52, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 20, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186

బస్సు షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు

- హనుమంతవాక జంక్షన్‌లో ఎండైనా, వానైనా ఆరు బయట వేచి ఉండాల్సిందే..
- 15 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్య



హనుమంతవాక జంక్షన్‌లో బస్సుల కోసం ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు

ఆరిలోవ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఒక ప్రధాన కూడలిగా పేరుగాంచిన హనుమంతవాక వద్ద ప్రయాణికులు వేచి ఉండేందుకు నీడ లేని పరిస్థితి. ఈ కూడలిలో రోజూ నిత్యం పదుల సంఖ్యలో ప్రయాణికులు బస్సులు, ఆటోల కోసం వేచి చూస్తూ ఉంటారు. అయితే బస్సు షెల్టర్ లేకపోవడంతో వీరంతా ఎంతసేపైనా ఎండలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి. వర్షం వచ్చినప్పుడు వీరి పరిస్థితి మరీ దయనీయంగా ఉంటోంది. ఇక్కడ బస్సు షెల్టర్ నిర్మించాలని ఎన్నాళ్ల నుంచో కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.నగరంలో వివిధ కార్యాలయాలు, సంస్థల్లో పని చేసే వారు శ్రీకాకుళం, విజయనగరం వైపు దారుల నుంచి వచ్చే వారంతా ఈ కూడలి మీదుగా రావాల్సిందే. అలాగే ఇటు వైపు సింహాచలం వైపు ఆరిలోవ, పెదగదిలి, చినగదిలి, శ్రీకృష్ణాపురం తదతర ప్రాంతాల నుంచి వచ్చే వారంతా హనుమంతువాక జంక్షన్ మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అందుకే ఈ కూడలి నిత్యం రద్దీగా ఉంటుంది. చాలా మంది ఈ జంక్షన్‌కు చేరుకొని, అక్కడ నుంచి వేరే బస్సులు, ఆటోల ద్వారా నగరంలోకి చేరుకుంటారు. ఫలితంగా హనుమంతువాకలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయితే వీరు వాహనాల కోసం వేచి చూసేందుకు అనువైన స్థలం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా.. కొన్నిసార్లు ఎక్కువ సేపు వేచి చూడాల్సి వచ్చేటపుడు అవస్థలు ఎదుర్కొంటున్నామని మహిళా ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లగా ఈ సమస్య ఉన్నా పట్టించుకునే వారే లేకుండా పోవడంతో పరిష్కారానికి నోచుకోవడం లేదు.

గతంలో.. బీఆర్టీఎస్ రోడ్డు వేయక ముందు ఇక్కడ బస్ షెల్టర్ ఉండేది, రోడ్ల అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించారు. అప్పటి నుంచి.. అనగా సుమారు 15 సంవత్సరాల నుంచి బస్సు షెల్టరు లేక ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతూనే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి హనుమంతవాకలో బస్సు షెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అప్రమత్తతతో క్షయ నిర్మూలన సాధ్యమే

బాలాజీనగర్ అర్బన్ ప్రైమరీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లలితాకిరణ్



క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ లలితాకిరణ్, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు

ఆరిలోవ, మార్చి18(ఆంధ్రజ్యోతి) ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని బాలాజీనగర్ అర్బన్ ప్రైమరీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లలితాకిరణ్ పేర్కొన్నారు. ఈ నెల 24న ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఆరిలోవ ఎఫ్‌ఆర్‌యుటీబీ యూనిట్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి వారోత్సవాలు నిర్వహించారు.

ఇందులో భాగంగా మంగళవారం ఆరిలోవ చివరి బస్టాప్ నుంచి దుర్గా బజార్ వరకు ఎఫ్‌ఆర్‌యుటీబీ యూనిట్ సిబ్బంది, బాలాజీనగర్, తోటగరువు యూపీహెచ్ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు క్షయ వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు వారాలు పైబడి దగ్గు, జ్వరం ఉంటే అది టీబీ కావచ్చన్నారు. వ్యాధిపై అప్రమత్తంగా ఉంటూ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. టీబీ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్టు తెలిపారు. అప్రమత్తంగా ఉంటే టీబీని నియంత్రించ వచ్చన్నారు. డాక్టర్ కిరణ్‌లలిత మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలో క్షయవ్యాధి నిర్మూలన సాధ్యమేనన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటే కుటుంబంతో పాటు సమాజం కూడా ఆరోగ్యం ఉంటూ ఆరోగ్య వంతమైన సమాజంగా రూపొందుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సూర్యనారాయణ, , సీనియర్ టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ వేములయ్య, టీబీ హెల్త్ విజిటర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓలా, ఉబర్, రాపిడో యాప్‌లో రాడార్ రద్దుచేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు, విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు

సిరిపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఓలా, ఉబర్, రాపిడో యాప్‌లో రాడార్ విధానాన్ని రద్దుచేయాలని సీఐటీయూ, విశాఖ క్యాబ్ డ్రైవర్స్ మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే బేరాలు లేకపోవడంతో ఈఎంఐలు కట్టలేక, పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి అద్దెలు, వైద్యం ఖర్చులు భరించలేక క్యాబ్‌డ్రైవర్స్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాడార్ ట్రిప్స్ కారణంగా ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయన్నారు. ఆయా యాప్‌లలో ప్రీపెయిడ్ ఆప్షన్ తీసివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు జగన్, పోలినాయుడు, శ్రీనివాసరావు, ఆనందం, చంటి, ప్రసాద్, క్యాబ్ డ్రైవర్స్ పాల్గొన్నారు.

ఏయూ వీసీని కలిసిన సీఎంఏ సభ్యులు



వీసీ రాజశేఖర్‌ను కలిసిన ఏయూసీఎంఏ సభ్యులు

వెంకోజీపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఆచార్య జీపీ రాజశేఖర్‌ను ఏయూ ఎఫిలియేటెడ్ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు పాలక మండలి సమావేశ మందిరంలో మంగళవారంగా కలిశారు. ప్రైవేటు కళాశాలలకు సంబంధించిన అంశాలను వీసీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఏయూ త్వరలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోయే శతాబ్ది ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులను కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు వీసీకి జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ దనుంజయరావు అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు టి.బలరామకృష్ణ, అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, జనరల్ సెక్రటరీ జి.రమణాజీ, ట్రెజరర్ శేఖర్, కుమార్, ఏయూ పరిధిలో ఉండే డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు విశాఖ జట్టు ఎంపిక

పెదవాల్తేరు, మార్చి 18, (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకూ బిహార్‌లోని గయా పట్టణంలో జరగనున్న 34వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొనే విశాఖ జిల్లా బాలురు, బాలికలు కబడ్డీ జట్టును మంగళవారం ఎంపిక చేసినట్టు విశాఖ జిల్లా సంఘం కార్యదర్శి జేవీస్వీ ప్రసాద్ రెడ్డి తెలి



రాష్ట్ర స్థాయి కబడ్డీలో ప్రతిభ చూపి జట్టుకు ఎంపికైన పి.శ్రీనివాసులు, ద్రాక్షాయణి

పారు. ఇటీవల వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందుల వైఎస్ఆర్ ఇంటిగ్రేటెట్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉత్తమ క్రీడాకారులుగా ఎంపికైన విశాఖపట్నం జిల్లా క్రీడాకారులు సబ్ జూనియర్ బాలురు విభాగంలో పల్లి శ్రీనువాసులు, సబ్ జూనియర్ బాలికల విభాగంలో ద్రాక్షయణిని ఎంపిక చేసినట్టు చేసినట్టు తెలిపారు. బాలికల కోచ్‌గా పి.చైతన్య (డీఎస్ఏ) బాలురు కోచ్‌గా కె.జయను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎపికైన క్రీడాకారులను విశాఖ జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి జేవీస్వీ ప్రసాద్ రెడ్డి, జాయింట్ కార్యదర్శి సీహెచ్ గోవింద్, కోశాధికారి కారి లక్ష్మణరావు, సభ్యులు వైవీ శ్రీనివాస్, వి.కనక రాజు, పండా శ్రీను తదితరులు అభినందించారు.

నేర పరిశోధనపై అవగాహన ఉండాలి

- విశాఖ పోలీసు కమిషనరేట్ లీగల్ అడ్వైజర్ రామకృష్ణారావు
- న్యాయ విశ్వవిద్యాలయంలో సీఎస్ఐ జాతీయ పోటీలు ప్రారంభం



క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ 6వ జాతీయ పోటీలను ప్రారంభిస్తున్న విశాఖ పోలీసు కమిషనరేట్ న్యాయసలహాదారు రామకృష్ణారావు. పక్కన వైస్‌చాన్సలర్ సూర్యప్రకాశరావు

సబ్బవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నేరాలకు సంబంధించి 'క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్‌పై పోలీసులతో పాటు న్యాయ విద్యార్థులు కూడా అవగాహన కలిగి ఉండాలని విశాఖ పోలీసు కమిషనరేట్ లీగల్ అడ్వైజర్ రామకృష్ణారావు పేర్కొన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయవిశ్వవిద్యాలయంలోని ఇంక్యూబేషన్ సెంటర్ ఆధ్వర్యంలోమంగళవారం 'క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ (సీఎస్ఐ) 6వ జాతీయ పోటీలను అయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ, నేరం జరిగిన ప్రదేశం, అక్కడ ఆధారాలు సేకరించడం కేసు విచారణకు ఎంతో కీలకమని చెప్పారు. చిన్నపాటి ఆధారాన్ని కూడా వదలకూడదని స్పష్టం చేశారు. మారుతున్న పరిస్థితులు, సాంకేతిక అభివృద్ధి కారణంగా కొత్త తరహాలో నేరాలు జరుగుతున్నాయని, ఇందుకు అనుగుణంగా సాంకేతిక అంశాలపై న్యాయ విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ మాట్లాడుతూ, ఒక కేసులో న్యాయం జరగాలంటే ఆ కేసులో వాస్తవాలు, సాక్ష్యాలను సేకరించడం ఎంతో కీలకం అన్నారు. సరైన సాక్ష్యం సేకరించకపోతే బాధితులకు అన్యాయం జరుగుతుం దన్నారు. న్యాయవాద వృత్తిలోకి వచ్చే ముందు క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ పోటీలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, సీఎస్ఐ ద్వారా న్యాయ విద్యార్థులు నేర పరిశోధనలో నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు ఆచరణాత్మక అనుభవాన్ని పెంచుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నందిని సీపీ, ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ లక్ష్మి, డాక్టర్ రిఫత్‌ఖాన్, రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐ ఎర్రన్నాయుడికి సన్మానం



సీఐని సన్మానిస్తున్న నిర్వాహకులు

ఆరిలోవ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నీతి నిజాయితీకి మారు పేరు సీఐ ఎర్రన్నాయుడు అని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు సంఘం కార్యదర్శి జీఎస్ఎన్ రాజు అన్నారు. మంగళవారం విశాలాక్షినగర్ జ్యోతి ఆర్కేడ్‌లో సీఐ ఎర్రన్నాయుడిని సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజు మాట్లాడుతూ శాంతి భద్రతల పరరిక్షణ, ప్రజలకు న్యాయం చేయడంలో ఎర్రన్నాయుడు ముందు ఉండేవారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎర్రన్నానాయడు మాట్లాడుతూ తాను ప్రస్తుతానికి రెండో పట్టణ సీఐగా ఉన్నానని న్నారు. చట్ట పరిధిలో పని చేస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా చూడడం తనకు అలవాటుగా మారిందన్నారు.ఇది అందరి సహకారంతో మాత్రమే చేయగలుగుతున్నానన్నారు. తనను సత్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ సిటిజన్‌లకు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులకు ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో రామాంజనేయకులు. ప్రకాశ్‌రావు ధనరాజు, వీర్రాజు, రాజశేఖర్, బొబ్బిలి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు..

ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వెంకోజీపాలెం, మార్చి18 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డు ఇసుకతోట ప్రాంతంలో ఉన్న శ్రీమహాలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ సముదాయం అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. విష్వక్సేన ఆరాధన, భగవత్ పుణ్యాహవాచన, పరిషత్, రుత్విక్ వరుణ్, దీక్షాధారణ, ధ్వజారోహణ, మండప ఆవాహన, అగ్నిప్రతిష్ఠ పూజలను నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను శోభాయాత్ర, అంకురారోపణ, పతాకప్రతిష్ఠ గద్యలు జరిపారు. ఆలయ అర్చకులు రేజేటి ఉగ్రనరసింహాచార్యులు సారథ్యంలో వేద పండితులు విశేష పూజలను చేశారు. భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శ్రీసీతారామ సేవా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నామని, ఆఖరి రోజున వార్షిక కల్యాణ మహోత్సవం, పండిత సత్కారం చేపట్టనున్నట్టు సేవా మండలి అధ్యక్షుడు ఎస్.సిరిన్ తెలిపారు. కార్యక్రమంలో సేవా మండలి మాజీ అధ్యక్షులుపి.చిన్నాబాబు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వద్దేవద్దు

ఏయూ ఎన్విరాన్‌మెంటల్ ప్రొఫెసర్ డాక్టర్ ఈయూబీ రెడ్డి



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వద్దంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్‌ను పూర్తిగా వినియోగించడం మానేయాలని ఏయూ ఎన్విరాన్‌మెంటల్ ప్రొఫెసర్ డాక్టర్ ఈయూబీ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎంవీపీ కాలనీలోని సమతా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రీన్ క్లైమెట్ సంస్థ నిర్వహించిన గ్లోబల్ రీసైకిలింగ్ డే సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యావరణానికి సహాయపడే వ్యక్తులు, సంస్థలు, సంఘాలను గౌరవించడానికి, ప్రోత్సహించడానికి గ్లోబ్ రీ సైకిలింగ్ డే ప్రతి సంవత్సరం మార్చి 18న నిర్వహిస్తారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం పిలుపునిచ్చిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, ఎకో వైజాగ్ వంటివి విజయవంతం కావడానికి అందరూ కృషిచేయాలని కోరారు. గ్రీన్ క్లైమెట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ వేసవిలో తినే దేశీయ పండ్ల గింజలు ఆరబెట్టాలని, వేసవి తర్వాత కొండలు, తీర ప్రాంతాల్లో చల్లడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. ఇంటిపై పక్షుల కోసం చిన్న కలశాల వంటివి ఉంచి అందులో నీరు వేయాలన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు జె. రాజేశ్వరి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో ఏయూకు గుర్తింపు తేవాలి

విద్యార్థులకు వీసీ రాజశేఖర్ పిలుపు



వీసీని కలిసిన విద్యార్థులు, ఆచార్యులు, ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

వెంకోజీపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) :నూతన ఆవిష్కరణతో విద్యార్థులు, పరిశోధకులు, ఆచార్యులు ఏయూకు గుర్తింపు తీసుకురావాలని ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, జువాలజీ విభాగం విద్యార్థులను టీకాబ్స్- ఇ సంస్థ నిర్వాహకులు డాక్టర్ యేడిది రవికిరణ్‌లను అభినందించారు. ఇటీవల జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్న వీరిని తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ది సిటిజన్ ఫోర్స్ ఫౌండేషన్ ఏయూ విద్యార్థులు డాక్టర్ రవికిరణ్ బయో మెడికల్ రంగంలో చేసిన పరిశోధనలు, 12 పేటెంట్లకు దరఖాస్తు చేయడం, నూతన ఆవిష్కరణలు చేయడాన్ని గుర్తిస్తూ నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డుతో సత్కరించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వీసీని తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఏయూ వీసీ అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఏయూ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రతిభ చూపాలని ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను అభినందించారు. బెంగళూరు యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ మెన్స్ టోర్నమెంట్లో రన్నర్స్‌గా గెలిచిన ఏయూ క్రీడా జట్టునుు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండడం, పూర్తి సామర్థ్యాలను ప్రదర్శించడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, క్రీడా విభాగం సంచాలకులు ఆచార్య ఎన్.విజయ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి అష్టదళ పద్మారాధన



స్వర్ణ పుష్పాలతో ఉభయదాతల పూజలు

మహారాణిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన సేవ నిర్వహించారు. ఆలయంలో ఉదయం 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజ చేశారు. అనంతరం అమ్మవారికి ఉభయదాతలు పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు టి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ మారువారం పండగ

కంచరపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్పీపేట గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి మారువారం పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కంచరపాలెం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. మారువారం పండగతో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి.

యోగ సిద్ధాంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో మారుతి

మురళీనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని సూర్యానగర్‌లో కొలువైన శ్రీ యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం సింధూర అర్చనలు, వడమాల, తమలపాకులతో పూజలు చేపట్టారు. ఆలయ పండితుడు శ్రీకాంత్ ఈ పూజాభిషేకాలు చేపట్టారు. రామ నామ స్మరణతో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో మారుతి సుందరమైన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపకుడు పి.సుబ్బరాజు, ఎం.వి.రాజశేఖర్, సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు వసతులు, దర్శనాల సౌకర్యం కల్పించారు.

21 నుంచి హిందీ నవరచయితల శిబిరం

జ్ఞానాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఈ నెల 21 నుంచి 28 వరకు భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ కేంద్రీయ హిందీ నిదేశాలయం సౌజన్యంతో హిందీయేతర విద్యార్థినులకు హిందీ నవరచయితల శిబిరం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డా.షైజీ తెలిపారు. కళాశాలలో మంగళవారం ఈ కార్యక్రమ బ్రోచర్‌ను విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాలు, మహారాష్ట్ర, కేరళ, ఢిల్లీ, ఆగ్రాల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొంటారని అన్నారు. శిబిరంలో హిందీలో కథ, కవిత, నాటిక, వ్యాస, పత్రికా రచనలు, అనువాద ప్రక్రియలను విద్యార్థులకు నేర్పిస్తారన్నారు.

రూ.10 లక్షల ఆస్తి పన్ను వసూలు

అల్లిపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలో మంగళవారం రెవెన్యూ అధికారులు భారీగా వసూళ్లు చేపట్టారు. 33వ వార్డులో వాణిజ్య సముదాయాల నుంచి రూ.10 లక్షలు వసూలు చేసి ఆ చెక్కును జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడుకు అందజేశారు. మరిన్ని మొండి బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని అధికారులకు జడ్సీ సూచించారు. ఆర్ఐ సీతారాం, వార్డు అడ్మిన్ కార్యదర్శి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త వినియోగంపై అవగాహన

మహారాణిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో చెత్త సేకరణ, వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు వ్యర్థాల యాజమాన్య సంస్థ ప్రతినిధి ఎస్వీ తులసీరామ్ తెలిపారు. మంగళవారం గోకుల్ పార్కు వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ హిత సానుకూల విధానాలు పాటించేలా ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తామన్నారు. విద్య, సమాచార సామగ్రితో సేవలందిస్తామని తెలిపారు. పాఠశాలల్లో సైతం విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలనే ప్రభుత్వ ప్రచారాన్ని ముందుకు తీసుకువెళతామని, పరిశుభ్రమైన హరితనగర సాధన లక్ష్యంగా చెత్త సేకరణకు కృషి చేయనున్నట్లు వివరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అక్కయ్యపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు వైస్సార్‌నగర్‌లో రూ.20 లక్షలతో సీసీ డ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక మంగళవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. వార్డు కార్పొరేటర్ హనోక్, నాయకులు పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధులకు టైమ్ బ్యాంక్ బాసట: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, వేదికపై ఇతర ప్రముఖులు

మహారాణిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఒంటరితనంతో ఇబ్బందిపడుతున్న వయోవృద్ధులకు తోడు దొరికి సాంత్వన లభించడం, సహాయకులు అండగా నిలవడం వంటి ప్రయోజనాలు లభిస్తాయని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. రాజస్థాన్‌కు చెందిన పి.సి.జైన్ బృందం అభివృద్ధి చేసిన 'టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' ద్వారా ఆయా వర్గాలకు ఊరట కలుగుతుందని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమీపంలోని పెన్షనర్ల సమావేశమందిరంలో వివిధ ప్రతిభావంతులు, టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంస్థ సహకారంతో విశాఖలో పైలట్ ప్రాజెక్టును మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధుల భావోద్వేగాలు పంచుకునేందుకు తోడు అవసరమని, ఈ టైమ్ బ్యాంక్ భావనతో పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవచ్చని అభిప్రాయపడ్డారు. వృద్ధులకు అండగా నిలిచేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ రీతుల్లో కృషి చేస్తోందని, దానిలో భాగంగానే టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంస్థ సహకారంతో వృద్ధులకు అండగా నిలిచేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. 18 ఏళ్లు దాటినవారు మొబైల్ యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచరును కలెక్టర్ ఆవిష్కరించారు. క్రైం డీసీపీ రాజ్‌కమల్, ఏడీజే మాధవి, అధికారులు లక్ష్మీపతి, అప్పలనాయుడు, విజయ్‌బాబు, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ సర్వే పక్కాగా నిర్వహించాలి: డీఈవో



చిల్డ్రన్ స్కూల్ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

కంచరపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): డ్రాపౌట్స్ పిల్లల వివరాలు పక్కాగా సేకరించి వాటికి సరైన కారణాలను సీఎస్ఈ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. గోపాలపట్నం మండలం 104 ఏరియాలోని నావల్ చిల్డ్రన్ స్కూల్‌ను డీఈవో మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ మండలంలో 3,257 డ్రాపౌట్స్‌లో 2,199 మంది పిల్లల కారణాలను మాత్రమే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారని, మిగిలిన వారి వివరాలు తక్షణమే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. నావీ స్కూల్ పిల్లలు ఇతర రాష్ట్రాలకు వలసపోవడంతో వారు ఏ ప్రాంతంలో ఉన్నారో తెలుసుకుని పాఠశాలల వివరాలు సేకరించాలన్నారు. ప్రతి పాఠశాల యాజమాన్యం తమ స్కూల్ డ్రాప్ బాక్స్‌లో పెండింగ్ లేకుండా తక్షణమే క్లియర్ చేయాలని కోరారు. గోపాలపట్నం ఎంఈవో దివాకర్, స్కూల్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ మారువారం మహోత్సవం



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న అతిథులు, గ్రామ కమిటీ ప్రతినిధులు

సీతమ్మధార, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెం గ్రామ దేవత ఏడుగుళ్ల అమ్మవారు ముత్యాలమ్మ మారువారం మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ముత్యాలమ్మను దర్శించుకొని పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు నాలుగు వేల మంది అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం అమ్మవారిని రామాలయం వద్ద గల పెద్దింటి నుంచి ఊరేగింపుగా ఏడుగుళ్ల ముత్యాలమ్మ ఆలయం వరకు భక్తులు మేళతాళాలతో తీసుకువెళ్లారు. ఆర్థిక సహాయం చేసిన ప్రతినిధులు, పలువురు రాజకీయ నాయకులు, గ్రామ కమిటీ ప్రతినిధులు, నక్కవానిపాలెం, గాంధీనగర్, పీఅండ్‌టీ కాలనీ, సీతమ్మధార, క్రాంతినగర్, చైతన్యనగర్, మద్దిలపాలెం, కెఆర్‌ఎం కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

నరసింహనగర్‌లో 'ప్రేమకు మనస్సు పెళ్లికి అలుసు' సినిమా చిత్రీకరణ



కార్యాలయ సన్నివేశంలో నటులకు సీన్ వివరిస్తున్న దర్శకుడు గీతా మోహన్

అక్కయ్యపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సర్వ శివ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న 'ప్రేమకు మనస్సు పెళ్లికి అలుసు' సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. మంగళవారం నరసింహనగర్‌లోని ఓ ప్రైవేటు కార్యాలయంలో నాలుగు రోజులుగా కొన్ని సన్నివేశాలు చిత్రీకరించినట్లు దర్శకుడు గీతామోహన్ తెలిపారు. ఈ చిత్రం పూర్తిగా హాస్య సన్నివేశాలతో ఉంటుందని, విశాఖకు చెందిన నటీనటులు, హైదరాబాద్‌కు చెందిన హీరోయిన్ నటిస్తున్నారని, సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ చిత్రంలో హీరోగా వెంకటేష్, హీరోయిన్‌గా షన్ను, నటీనటులు రమణమూర్తి, గోపీనాయుడు, కోటేశ్వరరావు, ఇమంది ఈశ్వరరావు, షరీఫ్, శ్రీహరి, సీత, వైజాగ్‌రాజు, ఐవీ సుబ్బారావు తదితరులు నటిస్తున్నారు. కో-డైరెక్టర్‌గా సీనియర్ నటి, నంది అవార్డు గ్రహీత హేమ, మేకప్‌మేన్ ధరణి, సాంకేతిక నిపుణులుగా షరీఫ్, ఉదయ్ కిరణ్ వ్యవహరిస్తున్నారు.

పోలీసు స్టేషన్‌కు హెల్మెట్ లేని వాహనదారులు



ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీలక్ష్మి

మహారాణిపేట/డాబాగార్డెన్స్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తూర్పు ట్రాఫిక్ సర్కిల్‌లోని టూటౌన్, మహారాణిపేట పోలీసులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినవారిపై కొరడా ఝుళిపించారు. అలాంటివారిని వాహనాలతో పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం వాహన యజమానులు ఐఎస్ఐ మార్కు ఉన్న హెల్మెట్ తీసుకువచ్చి చూపించాక కౌన్సెలింగ్ ఇచ్చి వాహనాలను అప్పగించారు. టూటౌన్ ట్రాఫిక్ పోలీసు అధికారులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే వాహనంతో పోలీసు స్టేషన్‌కు రావలసి ఉంటుందని స్పష్టం చేశారు. ఐఎస్ఐ మార్క్ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణరక్షణ లభిస్తుందని టూ టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ కె.శ్రీలక్ష్మి సూచించారు. ఎంఆర్ పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న 19 మందిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనదారులు ఐఎస్ఐ మార్క్ హెల్మెట్లు తీసుకొచ్చిన తరువాత వాహనాలను తిరిగి అప్పగించారు.

క్రీడల్లో విద్యార్థులు రాణిస్తే జీవితంలో ప్రత్యేక గుర్తింపు



పోటీల ప్రారంభ సూచికగా గాలిలోకి బెలూన్లు వదులుతున్న సన్ ఈడీ ఆశా జాస్తి

డాబాగార్డెన్స్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించడం ద్వారా జీవితంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, తద్వారా దేశానికి సేవ చేసే అవకాశం కలుగుతుందని సన్ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తి పేర్కొన్నారు. మంగళవారం సన్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు అవుట్‌డోర్, ఇండోర్ పోటీ 'పవర్ ప్లే'లను ఆమె ప్రారంభించారు. పోటీల ప్రారంభ సూచికగా తొలుత క్రీడాజ్యోతిని వెలిగించి గాలిలోకి బెలూన్లు వదిలారు. ఈ సందర్భంగా ఆశా జాస్తి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలు, చరిత్ర వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. వివిధ జట్లు పోటీల్లో పాల్గొంటే తమలోని ప్రతిభా పాటవాలు ప్రదర్శించేందుకు దోహదపడుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో క్రీడల్లో రాణించేవారికి మంచి భవిష్యత్ ఉందని తెలిపారు. ఈ నెల 22 వరకు పోటీలను పోర్టు స్టేడియం వేదికగా నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామని ఆమె తెలిపారు. విద్యార్థినులు ప్రత్యేకంగా ఇండోర్‌గేమ్స్‌లో రాణించేలా ప్రోత్సహించనున్నట్లు ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈల సాధికారకతపై నేడు సదస్సు

మహారాణిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సాధికారత దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం విశాఖలోని హోటల్ నోవాటెల్ వేదికగా వర్క్‌షాపు జరగనుంది. సీఐఐ సహకారంతో ఏపీ ఎంఎస్‌ఎంఈ అభివృద్ధి కార్పొరేషన్, నీతిఆయోగ్ సంయుక్తంగా 'ఎగుమతి ఆధారిత వృద్ధి ఎంఎస్‌ఎంఈలను సాధికారపరచటం' అనే అంశంపై చర్చిస్తారు. సుమారు 300 మంది ఎంఎస్‌ఎంఈ వ్యవస్థాపకులు, ఔత్సాహికులు పాల్గొంటారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌తో ఏయూ కళకళ

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగాన్ని సాధించాడు. మిగిలిన విద్యార్థులు రూ.4.5 లక్షల నుంచి తొమ్మిది లక్షల వేతనాలను పొందారు. అలాగే, ఫార్మసీ కాలేజీ పరిధిలోని 48 మంది నాలుగు లక్షల నుంచి ఆరు లక్షల రూపాయల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. వీరికి ఉద్యోగాలు కల్పించిన సంస్థల్లో ఫైజర్, డాక్టర్ రెడ్డీస్, లారస్, అరబిందో, సత్యారాక్స్ వంటివి ఉన్నాయి. న్యాయ విద్య పూర్తిచేసిన విద్యార్థులు భారీ వేతనాలతో ఉద్యోగాలు సాధించారు. ఇప్పటివరకూ పది మంది విద్యార్థులు మూడు లక్షల నుంచి ఏడు లక్షల రూపాయల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. వీరిలో ఎనిమిది మంది ప్రముఖ సంస్థ లీగల్ ఫోరంలో చేరగా, ఇద్దరు శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్‌లో లీగల్ అడ్వయిజర్స్‌గా చేరారు. స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌కు చెందిన 12 మంది విద్యార్థులు రూ.4 లక్షల నుంచి రూ.7 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. పలు సంస్థల్లో మార్కెటింగ్, బిజినెస్ అనలిటిక్స్ విభాగాల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

నిరంతరం టచ్‌లో ఉంటూ క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నాం



వర్సిటీలోని వివిధ కోర్సులు చేసిన విద్యార్థుల వివరాలు, వారిలో ఉన్న నైపుణ్యాలతో కూడిన జాబితా రూపొందించుకుని నిరంతరం కార్పొరేట్ కంపెనీలతో టచ్‌లో ఉంటున్నాం. ఆయా సంస్థలకు అవసరమైన మానవ వనరుల గురించి మాకు సమాచారాన్ని అందించిన వెంటనే ఇంటర్వ్యూల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. పరిశ్రమలు, సంస్థలు అవసరాలకు అనుగుణంగా స్కిల్స్ నేర్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ఇందుకోసం కొన్నాళ్ల కిందట ప్రవేశపెట్టిన ఇండస్ట్రీ మెంటార్‌షిప్, ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వీటివల్ల పరిశ్రమల అవసరాలపై విద్యార్థులకు ఒక అవగాహన కలుగుతోంది. గతంతో పోలిస్తే ఆర్ట్స్ అండ్ సైన్స్ విద్యార్థులు భారీ వేతనాలతో ఉద్యోగాలను సాధిస్తున్నారు.

- వీఆర్ రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్, సౌత్ క్యాంపస్ ఏయూ

డిమాండ్లు నెరవేర్చాలని ఈపీఎస్ పెన్షనర్ల ధర్నా



భవిష్యనిధి కార్యాలయం ఎదుట జాతీయ రహదారి వద్ద పెన్షనర్ల నిరసన

మర్రిపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ భవిష్య నిధి (పీఎఫ్) కార్యాలయ సమీపంలోని జాతీయ రహదారి వద్ద ఈపీఎస్ 95 పెన్షనర్లు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆలిండియా కో-ఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు విశాఖ జిల్లా కమిటీ అధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కమిటీ కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల సేవలో నిమగ్నమై తమ కనీస న్యాయమైన డిమాండ్లను కూడా పరిష్కరించడంలేదన్నారు. పెన్షన్ పెంచకుండా కమిటీలు వేసి కాలయాపన చేస్తోందన్నారు. ఇప్పటికైనా కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలని, ఈపీఎస్ పెన్షన్‌దారుల దంపతులకు వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును వక్రీకరించకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని నినదించారు. ఈపీఎస్ పెన్షనర్స్ కమిటీ జిల్లా కమిటీ కార్యదర్శి హుస్సేన్, పలు సంస్థల ప్రతినిధులు డీ.సీ.హెచ్.వెంకటేశ్వరరావు, ఎం.కృష్ణారావు, కాశేశ్వరరావు, తులసీరాం, మూర్తి, కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక

అక్కయ్యపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లలను మానసిక, సామాజికాభివృద్ధిలో ముందంజలో ఉంచాలన్న ఆశయానికి మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫార్సులు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. ఎస్‌జీజీటీఎస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పిల్లల వనరుల భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి సిబ్బంది, అధికారులు, తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. నైపుణ్యంతో కూడిన ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారు? పిల్లలకు బ్రెయిలీ లిపి, సంజ్ఞా భాష, స్పీచ్ థెరపీ వంటి ప్రత్యేక విద్యా విధానాలు ఎలా అమలు చేస్తున్నదీ సర్వశిక్ష అభియాన్ ఏపీసీ జె.చంద్రశేఖర్, జిల్లా ఐఈ కో-ఆర్డినేటర్ బిగీతలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి వివిధ సిఫార్సులు చేయనున్నట్లు చెప్పారు. అధికారులు రమణి కుమారి, రామారావు, బాలామణి పాల్గొన్నారు.

గుర్రంపాలెంలో అక్రమ క్వారీయింగ్

... 5వ పేజీ తరువాయి

భారీగా గ్రావెల్/మట్టి అవసరమైంది. అందుకు గనుల శాఖ నుంచి తాత్కాలిక పర్మిట్లు తీసుకోవాలి. కానీ అటువంటిదేమీ లేకుండా సమీపంలో గల కొండల నుంచి భారీస్థాయిలో గ్రావెల్/మట్టి తవ్వి ప్లాట్లు చదునుకు తరలించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురితం కావడంతో గనుల శాఖ, గనుల శాఖ విజిలెన్స్ అధికారులు పలుమార్లు తనిఖీలు చేశారు. గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌లో అక్రమ క్వారీయింగ్ ప్రాంతం, ఫిల్ చేసిన ప్లాట్లు పరిశీలించారు. ఈ వ్యవహారంలో గనులశాఖ విజిలెన్స్ అధికారులు సుమారు ఎనిమిది మందికి నోటీసులు జారీచేశారు. ఎంత మేర గ్రావెల్, మట్టి తవ్వి తరలించారో కొలతలు వేసి...ఆ మేరకు జరిమానా విధించాలంటూ గనుల శాఖ రెగ్యులర్ విభాగానికి సిఫారసు చేయాలి. అయితే జరిమానా విధింపుపై ఇంత వరకూ విజిలెన్స్ నుంచి రెగ్యులర్ విభాగానికి ఎటువంటి సమాచారం అందలేదు. నేతల నుంచి వచ్చిన ఒత్తిళ్ల కారణంగానే జరిమానా విధించే నోటీసులు జారీచేయాలని సూచిస్తూ రెగ్యులర్ విభాగానికి ఎటువంటి లేఖ రాయలేదని ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లకు వీర డిమాండ్

... 5వ పేజీ తరువాయి

నంబరుతో షిర్డీకి 2012లో వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి మధ్య ఆ రైలు ఆక్యుపెన్సీ 167.72 శాతం నమోదైంది. 2024 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 165.21 శాతం ఆక్యుపెన్సీ ఉంది.

- విశాఖపట్నం నుంచి 18567 నంబరుతో కొల్లాంకు 2014లో వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభించారు. ఈ రైలుకు 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 164.41 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది. 2024 ఏప్రిల్ నుంచి వరకు 163.98 శాతం ఆక్యుపెన్సీ ఉంది.
- విశాఖ నుంచి 20803 నంబరుతో గాంధీధామ్‌కు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను 2014లో ప్రారంభించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు దీని ఆక్యుపెన్సీ 107.94 శాతం ఉండగా, 2024 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 179.07 శాతం నమోదైంది.
- విశాఖపట్నం నుంచి 22801 నంబరుతో చెన్నై సెంట్రల్‌కు నడుపుతున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు 2023-24 ఆర్థిక సంవత్సరంలో 138.8 శాతం, 2024 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 139.92 శాతం ఆక్యుపెన్సీ వచ్చింది.

ఈ మార్గాల్లో వెయిటింగ్ లిస్ట్ జాబితా 227 నుంచి 805కు పెరిగింది. ఈ మార్గాల్లో ఎంత డిమాండ్ ఉందో చెప్పడానికి ఈ లెక్కలే నిదర్శనం.

విచిత్రంగా ఈ రైళ్లన్నీ విశాఖ నుంచి ఆయా గమ్యస్థానాలకు వెళ్లి ఆ మరుసటిరోజే అక్కడి నుంచి తిరిగి బయలుదేరుతున్నాయి. ఆయా నగరాల నుంచి రైలులో విశాఖపట్నం వెనక్కి రావాలంటే మళ్లీ ఈ రైలు వెళ్లేంత వరకు వారం రోజులు ఆగాల్సిందే. లేదంటే వేర్వేరు రైళ్లు మారాల్సి ఉంటుంది. రైలులో వెళ్లి అటు నుంచి విమానంలో వద్దామన్నా...షిర్డీ, గాంధీధామ్‌ల నుంచి ఆ సౌకర్యం కూడా లేదు. అందుకని వారానికి కనీసం రోజు తప్పించి రోజు ఈ రైళ్లు నడిపేలా చూడాలని విశాఖపట్నం రైలు వినియోగదారుల సంఘం తూర్పు కోస్తా రైల్వే అధికారులను కోరుతోంది.

ఢిల్లీలో ప్రయత్నిస్తేనే పచ్చజెండా

ఈ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లను వారానికి మూడు రోజులు నడిపేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ గత కొన్నాళ్లుగా వాల్తేరు డివిజన్ అధికారులు ప్రతిపాదనలు పెడుతున్నారు. అయితే ఈ రైళ్లు ఎక్కడికైతే వెళుతున్నాయో ఆ ప్రాంతానికి చెందిన రైల్వే జోనల్ అధికారులు కూడా దీనికి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. వీటికి సౌత్ సెంట్రల్, సౌత్ వెస్టర్న్ జోన్ అధికారులు అంగీకరించడం లేదని సమాచారం. వీటిపై అధికారులపరంగానే కాకుండా రాజకీయపరమైన ఒత్తిడి ఢిల్లీలో పెడితేనే పని జరుగుతుంది. ఉత్తరాంధ్ర ఎంపీలు ఆ రకమైన ప్రయత్నాలు చేయాల్సి ఉంది.

నేటి నుంచి పూర్తిస్థాయిలో ఇంటర్ మూల్యాంకనం

... 5వ పేజీ తరువాయి

పత్రాల మూల్యాంకనం సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. క్యాంప్ ఆఫీసర్, ఏసీవో, సీపీవో, కోడింగ్ అధికారులు స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం ఒకటో విడతలో తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మాథ్స్, సివిక్స్ జవాబుపత్రాల మూల్యాంకనం జరుగుతోంది. 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రెండో విడతలో ఫిజిక్స్, ఎకానమిక్స్, జీఎఫ్‌సీ, 24వ తేదీ నుంచి జరిగే మూడో విడత కెమిస్ట్రీ, హిస్టరీ, 26వ తేదీ నుంచి నిర్వహించే నాలుగో విడతలో కామర్స్, బోటనీ, జువాలజీ, బ్రిడ్జ్ కోర్సు జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తారు. విధులకు హాజరయ్యే ఎగ్జామినర్ల సంఖ్యను బట్టి ఈ నెల 31 లేదా ఏప్రిల్ రెండో తేదీ నాటికి ప్రక్రియను పూర్తిచేస్తామని ఆర్ఐవో తెలిపారు. ప్రథమ, ద్వితీయ పరీక్షా ఫలితాలను ఇంటర్ బోర్డు ఏప్రిల్ రెండో వారంలో విడుదల చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.

భారీ వాహనాలతో బెంబేలు

... 5వ పేజీ తరువాయి

వచ్చివెళుతున్నాయి. దీనివల్ల నగర అంతర్గత రోడ్లపై వాహనాల రాకపోకలకు ఆటంకం ఎదురవుతోంది.

కొత్త జాతీయ రహదారిపైకి మళ్లించాలి

నగరంలో భారీ వాహనాల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం కొత్త జాతీయ రహదారిని అందుబాటులోకి తెచ్చింది. అనకాపల్లి నుంచి పెందుర్తి మీదుగా ఆనందపురం జంక్షన్‌లో ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిని కలుపుతూ కొత్త రహదారిని నిర్మించింది. దీనివల్ల ఒడిశా, శ్రీకాకుళం వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించకుండా ఆనందపురం వద్ద నుంచి పెందుర్తి మీదుగా అనకాపల్లి వైపు వెళ్లేందుకు అవకాశం ఉంది. అలాగే చెన్నై, విజయవాడ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు నగరంలోకి రాకుండా అనకాపల్లి నుంచి పెందుర్తి మీదుగా ఆనందపురం వైపు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా భారీ వాహనాలు నగరంలోని ట్రాఫిక్ ఇబ్బందులను తప్పించుకుని సాఫీగా ప్రయాణం సాగించవచ్చు. అదేసమయంలో నగరంలో కూడా భారీ వాహనాల తాకిడి తగ్గి, ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని భావించారు. కానీ కొత్త జాతీయ రహదారిపై రెండు టోల్‌గేట్‌లు ఉండడంతో వాటిని తప్పించుకునేందుకు భారీ వాహనాలు నగరం మధ్య నుంచి ఉన్న జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీనివల్ల కొత్త జాతీయ రహదారి నిర్మాణ లక్ష్యం నెరవేరకుండా పోయినట్టయింది. మరోవైపు నగరంలో ట్రాఫిక్ సమస్య యథావిధిగా కొనసాగుతోంది. భారీ వాహనాల రాక వల్ల ఇబ్బందులు, జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని వాటిని కొత్త జాతీయ రహదారిపైగా మళ్లించేందుకు నగర పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

లేట'రైట్'!?

... 5వ పేజీ తరువాయి

కొండపైకి చేర్చారంటున్నారు. ఈ వారంలో రహదారి మరమ్మతులు పూర్తిచేసిన తరువాత తవ్వకాలు ప్రారంభించాలని భావిస్తున్నట్టు తెలిసింది. భమిడికలొద్దిలో 121 హెక్టార్లలో లేటరైట్ తవ్వకాలకు వైసీపీ ప్రభుత్వ హయాంలో అల్లూరి జిల్లా కొయ్యూరు మండలానికి చెందిన గిరిజనుడు జర్తా లక్ష్మణరావు పేరిట అనుమతులు వచ్చాయి. అయితే లక్ష్మణరావు బినామీ మాత్రమే. అయన్ను ముందుపెట్టి వైసీపీకి చెందిన కీలక నేత కుమారుడు లేటరైట్ తవ్వకాలు చేపట్టారు. భమిడికలొద్దిలో క్వారీయింగ్, అక్కడ నుంచి రౌతులపూడి వరకు రహదారి నిర్మించిన ప్రాంతంపై అనేక వివాదాలు ఉన్నాయి. రిజర్వు అటవీ ప్రాంతంలో వేలాది చెట్లు కొట్టేసి రోడ్డు నిర్మించారు. దీనిపై నాతవరం మండలానికి చెందిన మరిడయ్య ఎన్జీటీలో ఫిర్యాదు చేయడతో విచారణ జరిగింది. ఒకపక్క విచారణ జరుగుతుండగానే పాలకుల దన్నుతో లేటరైట్‌ను తవ్వేసి లక్షల క్యూబిక్ మీటర్లు తరలించుకుపోయారు. క్వారీ ప్రాంతంలో ఇప్పటివరకూ ఎంత తవ్వారు?, రాయల్టీ ఎంత చెల్లించారు?...అన్న విషయాలు గనుల శాఖ ఎన్నడూ వెల్లడించలేదు. గత ఏడాది ఎన్నికల ముందు తవ్వకాలు ఆపారు. అప్పటికే రౌతులపూడిలో నిల్వ చేసిన లక్షల క్యూబిక్ మీటర్ల లేటరైట్‌ను ఇటీవల కొందరు ఇతర ప్రాంతాలకు తరలించారు. ఇంకా రౌతులపూడి మండలంలో మరో రెండుచోట్ల ఉన్న నిల్వలను కొద్దిరోజుల నుంచి రాత్రిపూట తరలిస్తున్నారు. ప్రభుత్వం మారడంతో లేటరైట్ తవ్వకాల నుంచి వైసీపీ కీలక నేత కుమారుడు తప్పుకోగా, ప్రస్తుతం కూటమిలో ఉన్న పార్టీకి చెందిన మరో నాయకుడు రంగంలోకి దిగారు. లీజుదారుడు జర్తా లక్ష్మణరావుకు బినామీగా నర్సీపట్నానికి చెందిన వ్యాపారిని తెరపైకి తీసుకువచ్చారు. భమిడికలొద్ది క్వారీ ఉన్న సుందరకోట పంచాయతీలో ప్రజల నుంచి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంచాయతీలో సుందరకోట, భమిడికలొద్ది, హసనగిరి, తొత్రడ, ముంత మామిడిలొద్ది, పాత సిరిపురం, కొత్త సిరిపురం గ్రామాల ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా చూసుకునే బాధ్యతను స్థానిక నేతలకు అప్పగించారు. ఎనిమిది గ్రామాల పరిధిలో మొత్తం 500 వరకు బియ్యం కార్డుదారులుండగా ప్రతి కార్డుదారుడికి నెలకు రూ.1000 వంతున పరిహారం అందజేస్తామని హామీ ఇస్తున్నట్టు తెలిసింది.

నేడు జోన్-8లో తాగునీటి సరఫరాకు అంతరాయం

వెంకోజీపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-08 పరిధిలో వివిధ ప్రాంతాలకు వెళ్లే పైపులైను మరమ్మతులకు గురైనందున బుధవారం ఆయా ప్రాంతాల ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాపురం హెడ్ వాటర్ వర్క్స్ పంప్ హౌస్‌లో గల పంపుసెట్లు మరమ్మతుకు గురవడంతో బుధవారం తాగిపూడి ప్రధాన పైప్‌లైన్ పైన ఉన్న బల్క్ (రెసిడెన్షియల్)/ ఇండస్ట్రీస్ నీటి వినియోగదారులు, జోన్-8 పరిధిలో ఉన్న వార్డు 93(పి) నుంచి వార్డు 98లో గల ప్రాంతాలు, సాయిదుర్గానగర్, దుర్గానగర్, కృష్ణానగర్, అప్పలనరసింహం కాలనీ, వెంకట సాయినగర్, బంటా కాలనీ, రవినగర్ లక్ష్మీపురం, పోర్టు కాలనీ, రామ కో-ఆపరేటివ్ కాలనీ, హెచ్‌బీ కాలనీ, గోకుల్దాం కాలనీ, రెల్లివీధి, కృష్ణరాయపురం, గొల్లివిల్లివానిపాలెం, ఎల్ఐసీ కాలనీ, సుజాతనగర్, వాపయ్య రాజుపాలెం, పెందుర్తి పాత గ్రామం, తెలకలవీధి, జెడ్పీ హెచ్ఎస్ ఏరియా, ప్రశాంతి నగర్, క్రాంతి నగర్, వుడా కాలనీ, రైల్వే కాలనీ, సావిత్రి నగర్, అప్పన్నపాలెం, సింహపురి లేఅవుట్, అడవివరం, ఎస్సీకాలనీ, పాత అడవివరం, తదితర ప్రాంత్రాలో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

28న డాక్ పెన్షన్ అదాలత్

ఎంవీపీ కాలనీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 28న ఎంవీపీ కాలనీలోని ఆర్ఎంఎస్ వీ డివిజన్‌లో డివిజనల్ స్థాయిలో 103వ డాక్ పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్టు కార్యాలయం సూపరింటెడెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పదకొండు గంటల నుంచి ఆర్ఎంఎస్ పోస్టల్ సర్వీస్, పెన్షన్‌లకు సంబంధించిన ప్రజా పిర్యాదులు, నేరుగా ఫిర్యాదులు పరిష్కరించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారు. మెయిల్స్, స్పీడ్ పోస్టు, పార్శిల్స్, మనీ ఆర్డర్లు వంటి అన్ని సమస్యలతో వినియోగదారులు రావచ్చని ప్రకటనలో పేర్కొన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పరిధిలోని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. ఫిర్యాదులను ఈ నెల 15వ తేదీలోగా 'ఆర్ఎంఎస్ డాక్ పెన్షన్ అదాలత్ పేరుతో అడ్మినిస్ట్రేటివ్ కాంప్లెక్స్, ఎంవీపీ బస్ డిపో, ఎంవీపీ కాలనీ, విశాఖపట్నం 530 017' చిరునా మాకు పంపించాలన్నారు.

మైండ్‌ఫుల్‌నెస్ ద్వారా ఒత్తిడి దూరం

సాగర్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మైండ్‌ఫుల్‌నెస్ అనేది ఆలోచనలను నియంత్రించుకోవడమే కాకుండా ఒత్తిడులు, ఏకాగ్రతను పెంచుకోవడానికి శక్తివంతమైన సాధనం అని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నిరంతర విద్యావిభాగం శిక్షకుడు, ప్లేఫుల్ మైండ్‌ఫుల్‌నెస్ గ్రంధరచీయిత ఎడ్వర్డ్‌రెనేడె స్మినర్స్ పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **కోర్ట్ :** సంగం, శ్రీ వెంకటేశ్వర-1, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లీలిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి),
- **దిల్‌రుబా :** జగదాంబ, శ్రీకన్య, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర,
- **మజాకా :** రమాదేవి, శ్రీరామా, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడీ, కామేశ్వరి, కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు)40, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 30, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 24 దొండకాయలు 34, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది)50, బరబాటి 34, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 52, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 20, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామ కాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186

బస్సు షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు

» హనుమంతవాక జంక్షన్‌లో ఎండైనా, వానైనా ఆరు బయట వేచి ఉండాల్సిందే..
» 15 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్య


హనుమంతవాక జంక్షన్‌లో బస్సుల కోసం ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు

ఆరిలోవ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఒక ప్రధాన కూడలిగా పేరుగాంచిన హనుమంతవాక వద్ద ప్రయాణికులు వేచి ఉండేందుకు నీడ లేని పరిస్థితి. ఈ కూడలిలో రోజూ నిత్యం పదుల సంఖ్యలో ప్రయాణికులు బస్సులు, ఆటోల కోసం వేచి చూస్తూ ఉంటారు. అయితే బస్సు షెల్టర్ లేకపోవడంతో వీరంతా ఎంతసేపైనా ఎండలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి. వర్షం వచ్చినప్పుడు వీరి పరిస్థితి మరీ దయనీయంగా ఉంటోంది. ఇక్కడ బస్సు షెల్టర్ నిర్మించాలని ఎన్నాళ్ళ నుంచో కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.నగరంలో వివిధ కార్యాలయాలు, సంస్థల్లో పని చేసే వారు శ్రీకాకుళం, విజయనగరం వైపు దారుల నుంచి వచ్చే వారంతా ఈ కూడలి మీదుగా రావాల్సిందే. అలాగే ఇటు వైపు సింహాచలం వైపు ఆరిలోవ, పెదగదిలి, చినగదిలి, శ్రీకృష్ణాపురం తదతర ప్రాంతాల నుంచి వచ్చే వారంతా హనుమంతువాక జంక్షన్ మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అందుకే ఈ కూడలి నిత్యం రద్దీగా ఉంటుంది. చాలా మంది ఈ జంక్షన్‌కు చేరుకొని, అక్కడ నుంచి వేరే బస్సులు, ఆటోల ద్వారా నగరంలోకి చేరుకుంటారు. ఫలితంగా హనుమంతువాకలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయితే వీరు వాహనాల కోసం వేచి చూసేందుకు అనువైన స్థలం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా.. కొన్నిసార్లు ఎక్కువ సేపు వేచి చూడాల్సి వచ్చేటపుడు అవస్థలు ఎదుర్కొంటున్నామని మహిళా ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా పట్టించుకునే వారే లేకుండా పోవడంతో పరిష్కారానికి నోచుకోవడం లేదు.

గతంలో.. బీఆర్టీఎస్ రోడ్డు వేయక ముందు ఇక్కడ బస్ షెల్టర్ ఉండేది, రోడ్ల అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించారు. అప్పటి నుంచి.. అనగా సుమారు 15 సంవత్సరాల నుంచి బస్సు షెల్టరు లేక ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతూనే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి హనుమంతవాకలో బస్సు షెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అప్రమత్తతతో క్షయ నిర్మూలన సాధ్యమే

బాలాజీనగర్ అర్బన్ ప్రైమరీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లలితాకిరణ్


క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ లలితాకిరణ్, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు

ఆరిలోవ, మార్చి18(ఆంధ్రజ్యోతి) ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని బాలాజీనగర్ అర్బన్ ప్రైమరీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లలితాకిరణ్ పేర్కొన్నారు. ఈ నెల 24న ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఆరిలోవ ఎఫ్ఆర్‌యుటీబీ యూనిట్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి వారోత్సవాలు నిర్వహించారు.

ఇందులో భాగంగా మంగళవారం ఆరిలోవ చివరి బస్టాప్ నుంచి దుర్గా బజార్ వరకు ఎఫ్ఆర్‌యుటీబీ యూనిట్ సిబ్బంది, బాలాజీనగర్, తోటగరువు యూపీహెచ్ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు క్షయ వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు వారాలు పైబడి దగ్గు, జ్వరం ఉంటే అది టీబీ కావచ్చన్నారు. వ్యాధిపై అప్రమత్తంగా ఉంటూ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. టీబీ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్టు తెలిపారు. అప్రమత్తంగా ఉంటే టీబీని నియంత్రించ వచ్చన్నారు. డాక్టర్ కిరణ్‌లలిత మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలో క్షయవ్యాధి నిర్మూలన సాధ్యమేనన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటే కుటుంబంతో పాటు సమాజం కూడా ఆరోగ్యం ఉంటూ ఆరోగ్య వంతమైన సమాజంగా రూపొందుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సూర్యనారాయణ, , సీనియర్ టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ వేములయ్య, టీబీ హెల్త్ విజిటర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓలా, ఉబర్, రాపిడో యాప్‌లో రాడార్ రద్దుచేయాలి


నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు, విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు

సిరిపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఓలా, ఉబర్, రాపిడో యాప్‌లో రాడార్ విధానాన్ని రద్దుచేయాలని సీఐటీయూ, విశాఖ క్యాబ్ డ్రైవర్స్ మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే బేరాలు లేకపోవడంతో ఈఎంఐలు కట్టలేక, పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి అద్దెలు, వైద్యం ఖర్చులు భరించలేక క్యాబ్‌డ్రైవర్స్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాడార్ ట్రిప్స్ కారణంగా ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయన్నారు. ఆయా యాప్‌లలో ప్రీపెయిడ్ ఆప్షన్ తీసివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు జగన్, పోలినాయుడు, శ్రీనివాసరావు, ఆనందం, చంటి, ప్రసాద్, క్యాబ్ డ్రైవర్స్ పాల్గొన్నారు.

ఏయూ వీసీని కలిసిన సీఎంఏ సభ్యులు


వీసీ రాజశేఖర్‌ను కలిసిన ఏయూసీఎంఏ సభ్యులు

వెంకోజీపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఆచార్య జీపీ రాజశేఖర్‌ను ఏయూ ఎఫిలియేటెడ్ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు పాలక మండలి సమావేశ మందిరంలో మంగళవారంగా కలిశారు. ప్రైవేటు కళాశాలలకు సంబంధించిన అంశాలను వీసీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఏయూ త్వరలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోయే శతాబ్ధి ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులను కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు వీసీకి జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ దనుంజయరావు అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు టి.బలరామకృష్ణ, అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, జనరల్ సెక్రటరీ జి.రమణాజీ, ట్రెజరర్ శేఖర్, కుమార్, ఏయూ పరిధిలో ఉండే డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు విశాఖ జట్టు ఎంపిక

పెదవాల్తేరు, మార్చి 18, (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకూ బిహార్‌లోని గయా పట్టణంలో జరగనున్న 34వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొనే విశాఖ జిల్లా బాలురు, బాలికలు కబడ్డీ జట్టును మంగళవారం ఎంపిక చేసినట్టు విశాఖ జిల్లా సంఘం కార్యదర్శి జేఎస్వీ ప్రసాద్ రెడ్డి తెలి


రాష్ట్ర స్థాయి కబడ్డీలో ప్రతిభ చూపి జట్టుకు ఎంపికైన పి.శ్రీనివాసులు, ద్రాక్షాయణి

పారు. ఇటీవల వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందుల వైఎస్ఆర్ ఇంటిగ్రేటెట్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ చాంపియర్‌షిప్ పోటీల్లో ఉత్తమ క్రీడాకారులుగా ఎంపికైన విశాఖపట్నం జిల్లా క్రీడాకారులు సబ్ జూనియర్ బాలురు విభాగంలో పల్లి శ్రీనువాసులు, సబ్ జూనియర్ బాలికల విభాగంలో ద్రాక్షయణిని ఎంపిక చేసినట్టు చేసినట్టు తెలిపారు. బాలికల కోచ్‌గా పి.చైతన్య (డీఎస్‌ఏ) బాలురు కోచ్‌గా కె.జయను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఏపికైన క్రీడాకారులను విశాఖ జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి జేఎస్వీ ప్రసాద్ రెడ్డి, జాయింట్ కార్యదర్శి సీహెచ్ గోవింద్, కోశాధికారి కారి లక్ష్మణరావు, సభ్యులు వైవీ శ్రీనివాస్, వి.కనకరాజు, పండా శ్రీను తదితరులు అభినందించారు.

నేర పరిశోధనపై అవగాహన ఉండాలి

» విశాఖ పోలీసు కమిషనరేట్ లీగల్ అడ్వైజర్ రామకృష్ణారావు
» న్యాయ విశ్వవిద్యాలయంలో సీఎస్ఐ జాతీయ పోటీలు ప్రారంభం


క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ 6వ జాతీయ పోటీలను ప్రారంభిస్తున్న విశాఖ పోలీసు కమిషనరేట్ న్యాయసలహాదారు రామకృష్ణారావు. పక్కన వైస్‌చాన్సలర్ సూర్యప్రకాశరావు

సబ్బవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నేరాలకు సంబంధించి 'క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్'పై పోలీసులతో పాటు న్యాయ విద్యార్థులు కూడా అవగాహన కలిగి ఉండాలని విశాఖ పోలీసు కమిషనరేట్ లీగల్ అడ్వైజర్ రామకృష్ణారావు పేర్కొన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయవిశ్వవిద్యాలయంలోని ఇంక్యూబేషన్ సెంటర్ ఆధ్వర్యంలోమంగళవారం 'క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ (సీఎస్ఐ) 6వ జాతీయ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ, నేరం జరిగిన ప్రదేశం, అక్కడ ఆధారాలు సేకరించడం కేసు విచారణకు ఎంతో కీలకమని చెప్పారు. చిన్నపాటి ఆధారాన్ని కూడా వదలకూడదని స్పష్టం చేశారు. మారుతున్న పరిస్థితులు, సాంకేతిక అభివృద్ధి కారణంగా కొత్త తరహాలో నేరాలు జరుగుతున్నాయని, ఇందుకు అనుగుణంగా సాంకేతిక అంశాలపై న్యాయ విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ మాట్లాడుతూ, ఒక కేసులో న్యాయం జరగాలంటే ఆ కేసులో వాస్తవాలు, సాక్ష్యాలను సేకరించడం ఎంతో కీలకం అన్నారు. సరైన సాక్ష్యం సేకరించకపోతే బాధితులకు అన్యాయం జరుగుతుం దన్నారు. న్యాయవాద వృత్తిలోకి వచ్చే ముందు క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ పోటీలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, సీఎస్ఐ ద్వారా న్యాయ విద్యార్థులు నేర పరిశోధనలో నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు ఆచరణాత్మక అనుభవాన్ని పెంచుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నందిని సీపీ, ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ లక్ష్మి, డాక్టర్ రిఫత్‌ఖాన్, రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐ ఎర్రన్నాయుడికి సన్మానం


సీఐని సన్మానిస్తున్న నిర్వాహకులు

ఆరిలోవ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నీతి నిజాయితీకి మారు పేరు సీఐ ఎర్రన్నాయుడు అని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు సంఘం కార్యదర్శి జీఎస్ఎన్ రాజు అన్నారు. మంగళవారం విశాలాక్షినగర్ జ్యోతి ఆర్కేడ్‌లో సీఐ ఎర్రన్నాయుడిని సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజు మాట్లాడుతూ శాంతి భద్రతల పరరిక్షణ, ప్రజలకు న్యాయం చేయడంలో ఎర్రన్నాయుడు ముందు ఉండేవారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎర్రన్నానాయడు మాట్లాడుతూ తాను ప్రస్తుతానికి రెండో పట్టణ సీఐగా ఉన్నానని న్నారు. చట్ట పరిధిలో పని చేస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా చూడడం తనకు అలవాటుగా మారిందన్నారు.ఇది అందరి సహకారంతో మాత్రమే చేయగలుగుతున్నానన్నారు. తనను సత్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ సిటిజన్‌లకు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులకు ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో రామాంజనేయకులు. ప్రకాశ్‌రావు ధనరాజు, వీర్రాజు, రాజశేఖర్, బొబ్బిలి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వెంకోజీపాలెం, మార్చి18 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డు ఇసుకతోట ప్రాంతంలో ఉన్న శ్రీమహాలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ సముదాయం అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. విష్వక్సేన ఆరాధన, భగవత్ పుణ్యహావచన, పరిషత్, రుత్విక్ వరుణ్, దీక్షాధారణ, ధ్వజారోహణ, మండప ఆవాహన, అగ్నిప్రతిష్ఠ పూజలను నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను శోభాయాత్ర, అంకురారోపణ, పతాకప్రతిష్ఠ గద్యలు జరిపారు. ఆలయ అర్చకులు రేజేటి ఉగ్రనరసింహాచార్యులు సారథ్యంలో వేద పండితులు విశేష పూజలను చేశారు. భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శ్రీసీతారామ సేవా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నామని, ఆఖరి రోజున వార్షిక కల్యాణ మహోత్సవం, పండిత సత్కారం చేపట్టనున్నట్టు సేవా మండలి అధ్యక్షుడు ఎస్.సిరిన్ తెలిపారు. కార్యక్రమంలో సేవా మండలి మాజీ అధ్యక్షులుపి.చిన్నాబాబు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వద్దేవద్దు

ఏయూ ఎన్విరాన్‌మెంటల్ ప్రొఫెసర్ డాక్టర్ ఈయూబీ రెడ్డి


సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వద్దంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్‌ను పూర్తిగా వినియోగించడం మానేయాలని ఏయూ ఎన్విరాన్‌మెంటల్ ప్రొఫెసర్ డాక్టర్ ఈయూబీ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎంవీపీ కాలనీలోని సమతా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రీన్ క్లైమెట్ సంస్థ నిర్వహించిన గ్లోబల్ రీసైకిలింగ్ డే సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యావరణానికి సహాయపడే వ్యక్తులు, సంస్థలు, సంఘాలను గౌరవించడానికి, ప్రోత్సహించడానికి గ్లోబ్ రీ సైకిలింగ్ డే ప్రతి సంవత్సరం మార్చి 18న నిర్వహిస్తారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం పిలుపునిచ్చిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, ఎకో వైజాగ్ వంటివి విజయవంతం కావడానికి అందరూ కృషిచేయాలని కోరారు. గ్రీన్ క్లైమెట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ వేసవిలో తినే దేశీయ పండ్ల గింజలు ఆరబెట్టాలని, వేసవి తర్వాత కొండలు, తీర ప్రాంతాల్లో చల్లడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. ఇంటిపై పక్షుల కోసం చిన్న కలశాల వంటివి ఉంచి అందులో నీరు వేయాలన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు జె.రాజేశ్వరి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో ఏయూకు గుర్తింపు తేవాలి

విద్యార్థులకు వీసీ రాజశేఖర్ పిలుపు


వీసీని కలిసిన విద్యార్థులు, ఆచార్యులు, ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

వెంకోజీపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) :నూతన ఆవిష్కరణతో విద్యార్థులు, పరిశోధకులు, ఆచార్యులు ఏయూకు గుర్తింపు తీసుకురావాలని ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, జువాలజీ విభాగం విద్యార్థులను టీకాబ్స్- ఇ సంస్థ నిర్వాహకులు డాక్టర్ యేడిది రవికిరణ్‌లను అభినందించారు. ఇటీవల జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్న వీరిని తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ది సిటిజన్ ఫోర్స్ ఫౌండేషన్ ఏయూ విద్యార్థులు డాక్టర్ రవికిరణ్ బయో మెడికల్ రంగంలో చేసిన పరిశోధనలు, 12 పేటెంట్లకు దరఖాస్తు చేయడం, నూతన ఆవిష్కరణలు చేయడాన్ని గుర్తిస్తూ నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డుతో సత్కరించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వీసీని తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఏయూ వీసీ అభినందనలు


క్రీడాకారులను అభినందిస్తున్న వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఏయూ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రతిభ చూపాలని ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను అభినందించారు. బెంగళూరు యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ మెన్స్ టోర్నమెంట్లో రన్నర్స్‌గా గెలిచిన ఏయూ క్రీడా జట్టును ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండడం, పూర్తి సామర్థ్యాలను ప్రదర్శించడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, క్రీడా విభాగం సంచాలకులు ఆచార్య ఎస్.విజయ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి అష్టదళ పద్మారాధన



స్వర్ణ పుష్పాలతో ఉభయదాతల పూజలు

మహారాణిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన సేవ నిర్వహించారు. ఆలయంలో ఉదయం 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజ చేశారు. అనంతరం అమ్మవారికి ఉభయదాతలు పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు టి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ మారువారం పండగ

కంచరపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్పీపేట గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి మారువారం పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కంచరపాలెం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. మారువారం పండగతో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి.

యోగ సిద్ధాంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో మారుతి

మురళీనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని సూర్యానగర్‌లో కొలువైన శ్రీ యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం సింధూర అర్చనలు, వడమాల, తమలపాకులతో పూజలు చేపట్టారు. ఆలయ పండితుడు శ్రీకాంత్ ఈ పూజాభిషేకాలు చేపట్టారు. రామ నామ స్మరణతో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో మారుతి సుందరమైన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపకుడు పి.సుబ్బరాజు, ఎం.వి.రాజశేఖర్, సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు వసతులు, దర్శనాల సౌకర్యం కల్పించారు.

21 నుంచి హిందీ నవరచయితల శిబిరం

జ్ఞానాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఈ నెల 21 నుంచి 28 వరకు భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ కేంద్రీయ హిందీ నిదేశాలయం సౌజన్యంతో హిందీయేతర విద్యార్థినులకు హిందీ నవరచయితల శిబిరం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డా.షైజీ తెలిపారు. కళాశాలలో మంగళవారం ఈ కార్యక్రమ బ్రోచర్‌ను విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాలు, మహారాష్ట్ర, కేరళ, ఢిల్లీ, ఆగ్రాల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొంటారని అన్నారు. శిబిరంలో హిందీలో కథ, కవిత, నాటిక, వ్యాస, పత్రికా రచనలు, అనువాద ప్రక్రియలను విద్యార్థులకు నేర్పిస్తారన్నారు.

రూ.10 లక్షల ఆస్తి పన్ను వసూలు

అల్లిపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలో మంగళవారం రెవెన్యూ అధికారులు భారీగా వసూళ్లు చేపట్టారు. 33వ వార్డులో వాణిజ్య సముదాయాల నుంచి రూ.10 లక్షలు వసూలు చేసి ఆ చెక్కును జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడుకు అందజేశారు. మరిన్ని మొండి బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని అధికారులకు జడ్సీ సూచించారు. ఆర్ఐ సీతారాం, వార్డు అడ్మిన్ కార్యదర్శి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త వినియోగంపై అవగాహన

మహారాణిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో చెత్త సేకరణ, వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు వ్యర్థాల యాజమాన్య సంస్థ ప్రతినిధి ఎస్వీ తులసీరామ్ తెలిపారు. మంగళవారం గోకుల్ పార్కు వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ హిత సానుకూల విధానాలు పాటించేలా ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తామన్నారు. విద్య, సమాచార సామగ్రితో సేవలందిస్తామని తెలిపారు. పాఠశాలల్లో సైతం విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలనే ప్రభుత్వ ప్రచారాన్ని ముందుకు తీసుకువెళతామని, పరిశుభ్రమైన హరితనగర సాధన లక్ష్యంగా చెత్త సేకరణకు కృషి చేయనున్నట్లు వివరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అక్కయ్యపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు వైస్సార్‌నగర్‌లో రూ.20 లక్షలతో సీసీ డ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక మంగళవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. వార్డు కార్పొరేటర్ హనోక్, నాయకులు పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధులకు టైమ్ బ్యాంక్ బాసట: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, వేదికపై ఇతర ప్రముఖులు

మహారాణిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఒంటరితనంతో ఇబ్బందిపడుతున్న వయోవృద్ధులకు తోడు దొరికి సాంత్వన లభించడం, సహాయకులు అండగా నిలవడం వంటి ప్రయోజనాలు లభిస్తాయని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. రాజస్థాన్‌కు చెందిన పి.సి.జైన్ బృందం అభివృద్ధి చేసిన 'టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' ద్వారా ఆయా వర్గాలకు ఊరట కలుగుతుందని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమీపంలోని పెన్షనర్ల సమావేశమందిరంలో విభిన్న ప్రతిభావంతులు, టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంస్థ సహకారంతో విశాఖలో పైలట్ ప్రాజెక్టును మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధుల భావోద్వేగాలు పంచుకునేందుకు తోడు అవసరమని, ఈ టైమ్ బ్యాంక్ భావనతో పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవచ్చని అభిప్రాయపడ్డారు. వృద్ధులకు అండగా నిలిచేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విభిన్న రీతుల్లో కృషి చేస్తోందని, దానిలో భాగంగానే టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంస్థ సహకారంతో వృద్ధులకు అండగా నిలిచేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. 18 ఏళ్లు దాటినవారు మొబైల్ యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచరును కలెక్టర్ ఆవిష్కరించారు. క్రైం డీసీపీ రాజ్‌కమల్, ఏడీజే మాధవి, అధికారులు లక్ష్మీపతి, అప్పలనాయుడు, విజయ్‌బాబు, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ సర్వే పక్కాగా నిర్వహించాలి: డీఈవో



చిల్డ్రన్ స్కూల్ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

కంచరపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): డ్రాపౌట్స్ పిల్లల వివరాలు పక్కాగా సేకరించి వాటికి సరైన కారణాలను సీఎస్ఈ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. గోపాలపట్నం మండలం 104 ఏరియాలోని నావల్ చిల్డ్రన్ స్కూల్‌ను డీఈవో మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ మండలంలో 3,257 డ్రాపౌట్స్‌లో 2,199 మంది పిల్లల కారణాలను మాత్రమే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారని, మిగిలిన వారి వివరాలు తక్షణమే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. నావీ స్కూల్ పిల్లలు ఇతర రాష్ట్రాలకు వలసపోవడంతో వారు ఏ ప్రాంతంలో ఉన్నారో తెలుసుకుని పాఠశాలల వివరాలు సేకరించాలన్నారు. ప్రతి పాఠశాల యాజమాన్యం తమ స్కూల్ డ్రాప్ బాక్స్‌లో పెండింగ్ లేకుండా తక్షణమే క్లియర్ చేయాలని కోరారు. గోపాలపట్నం ఎంఈవో దివాకర్, స్కూల్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

నరసింహనగర్‌లో 'ప్రేమకు మనస్సు పెళ్లికి అలుసు' సినిమా చిత్రీకరణ



కార్యాలయ సన్నివేశంలో నటులకు సీన్ వివరిస్తున్న దర్శకుడు గీతా మోహన్

అక్కయ్యపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సర్వ శివ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న 'ప్రేమకు మనస్సు పెళ్లికి అలుసు' సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. మంగళవారం నరసింహనగర్‌లోని ఓ ప్రైవేటు కార్యాలయంలో నాలుగు రోజులుగా కొన్ని సన్నివేశాలు చిత్రీకరించినట్లు దర్శకుడు గీతామోహన్ తెలిపారు. ఈ చిత్రం పూర్తిగా హాస్య సన్నివేశాలతో ఉంటుందని, విశాఖకు చెందిన నటీనటులు, హైదరాబాద్‌కు చెందిన హీరోయిన్ నటిస్తున్నారని, సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ చిత్రంలో హీరోగా వెంకటేశ్, హీరోయిన్‌గా షన్ను, నటీనటులు రమణమూర్తి, గోపీనాయుడు, కోటేశ్వరరావు, ఇమంది ఈశ్వరరావు, షరీఫ్, శ్రీహరి, సీత, వైజాగ్‌రాజు, ఐవీ సుబ్బారావు తదితరులు నటిస్తున్నారు. కో-డైరెక్టర్‌గా సీనియర్ నటి, నంది అవార్డు గ్రహీత హేమ, మేకప్‌మేన్ ధరణి, సాంకేతిక నిపుణులుగా షరీఫ్, ఉదయ్ కిరణ్ వ్యవహరిస్తున్నారు.

క్రీడల్లో విద్యార్థులు రాణిస్తే జీవితంలో ప్రత్యేక గుర్తింపు

డాబాగార్డెన్స్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించడం ద్వారా జీవితంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, తద్వారా దేశానికి సేవ చేసే అవకాశం కలుగుతుందని సన్ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తి పేర్కొన్నారు. మంగళవారం సన్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు అవుట్‌డోర్, ఇండోర్ పోటీ 'పవర్ ప్లే'లను ఆమె ప్రారంభించారు. పోటీల ప్రారంభ సూచికగా తొలుత క్రీడాజ్యోతిని వెలిగించి గాలిలోకి బెలూన్లు వదిలారు. ఈ సందర్భంగా ఆశా జాస్తి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలు, చరిత్ర వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. వివిధ జట్లు పోటీల్లో పాల్గొంటే తమలోని ప్రతిభా పాటవాలు ప్రదర్శించేందుకు దోహదపడుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో క్రీడల్లో రాణించేవారికి మంచి భవిష్యత్ ఉందని తెలిపారు. ఈ నెల 22 వరకు పోటీలను పోర్టు స్టేడియం వేదికగా నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామని ఆమె తెలిపారు. ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేర పరిశోధనపై అవగాహన ఉండాలి

- విశాఖ పోలీసు కమిషనరేట్ లీగల్ అడ్వైజర్ రామకృష్ణారావు
- న్యాయ విశ్వవిద్యాలయంలో సీఎస్ఐ జాతీయ పోటీలు ప్రారంభం



క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ 6వ జాతీయ పోటీలను ప్రారంభిస్తున్న విశాఖ పోలీసు కమిషనరేట్ న్యాయసలహాదారు రామకృష్ణారావు. పక్కన వైస్‌చాన్సలర్ సూర్యప్రకాశరావు.

సబ్బవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నేరాలకు సంబంధించి 'క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్'పై పోలీసులతోపాటు న్యాయ విద్యార్థులు కూడా అవగాహన కలిగి ఉండాలని విశాఖ పోలీసు కమిషనరేట్ లీగల్ అడ్వైజర్ రామకృష్ణారావు పేర్కొన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలోని ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం 'క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ (సీఎస్ఐ) 6వ జాతీయ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ, నేరం జరిగిన ప్రదేశం, అక్కడ ఆధారాలు సేకరించడం కేసు విచారణకు ఎంతో కీలకమని చెప్పారు. చిన్నపాటి ఆధారాన్ని కూడా వదలకూడదని స్పష్టం చేశారు. మారుతున్న పరిస్థితులు, సాంకేతిక అభివృద్ధి కారణంగా కొత్త తరహాలో నేరాలు జరుగుతున్నాయని, ఇందుకు అనుగుణంగా సాంకేతిక అంశాలపై న్యాయ విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ మాట్లాడుతూ, ఒక కేసులో న్యాయం జరగాలంటే ఆ కేసులో వాస్తవాలు, సాక్ష్యాలను సేకరించడం ఎంతో కీలకం అన్నారు. సరైన సాక్ష్యం సేకరించకపోతే బాధితులకు అన్యాయం జరుగుతుం దన్నారు. న్యాయవాద వృత్తిలోకి వచ్చే ముందు క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ పోటీలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, సీఎస్ఐ ద్వారా న్యాయ విద్యార్థులు నేర పరిశోధనలో నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు ఆచరణాత్మక అనుభవాన్ని పెంచుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నందిని సీపీ, ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ లక్ష్మి, డాక్టర్ రిపత్‌ఖాన్, రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌కు హెల్మెట్ లేని వాహనదారులు

మహారాణిపేట/డాబాగార్డెన్స్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తూర్పు ట్రాఫిక్ సర్కిల్‌లోని టూటౌన్, మహారాణిపేట పోలీసులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినవారిపై కొరడా ఝుళిపించారు. అలాంటివారిని వాహనాలతో పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం వాహన యజమానులు ఐఎస్ఐ మార్కు ఉన్న హెల్మెట్ తీసుకువచ్చి చూపించాక కౌన్సెలింగ్ ఇచ్చి వాహనాలను అప్పగించారు. టూటౌన్ ట్రాఫిక్ పోలీసు అధికారులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే వాహనంతో పోలీసు స్టేషన్‌కు రావలసి ఉంటుందని స్పష్టం చేశారు. ఐఎస్ఐ మార్క్ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణరక్షణ లభిస్తుందని టూ టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ కె.శ్రీలక్ష్మి సూచించారు. ఎంఆర్ పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న 19 మందిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనదారులు ఐఎస్ఐ మార్క్ హెల్మెట్లు తీసుకొచ్చిన తరువాత వాహనాలను తిరిగి అప్పగించారు. ఇకపై నిబంధనలు పాటించాలని సూచించారు.

ఎంఎస్ఎంఈల సాధికారకతపై నేడు సదస్సు

మహారాణిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సాధికారత దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం విశాఖలోని హోటల్ నోవాటెల్ వేదికగా వర్కుషాపు జరగనుంది. సీఐఐ సహకారంతో ఏపీ ఎంఎస్ఎంఈ అభివృద్ధి కార్పొరేషన్, నీతిఆయోగ్ సంయుక్తంగా 'ఎగుమతి ఆధారిత వృద్ధి ఎంఎస్ఎంఈలను సాధికారపరచటం' అనే అంశంపై చర్చిస్తారు. సుమారు 300 మంది పాల్గొంటారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌తో ఏయూ కళకళ

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగాన్ని సాధించాడు. మిగిలిన విద్యార్థులు రూ.4.5 లక్షల నుంచి తొమ్మిది లక్షల వేతనాలను పొందారు. అలాగే, ఫార్మసీ కాలేజీ పరిధిలోని 48 మంది నాలుగు లక్షల నుంచి ఆరు లక్షల రూపాయల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. వీరికి ఉద్యోగాలు కల్పించిన సంస్థల్లో ఫైజర్, డాక్టర్ రెడ్డీస్, లారస్, అరబిందో, సత్యరాక్స్ వంటివి ఉన్నాయి. న్యాయ విద్య పూర్తిచేసిన విద్యార్థులు భారీ వేతనాలతో ఉద్యోగాలు సాధించారు. ఇప్పటివరకూ పది మంది విద్యార్థులు మూడు లక్షల నుంచి ఏడు లక్షల రూపాయల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. వీరిలో ఎనిమిది మంది ప్రముఖ సంస్థ లీగల్ ఫోరంలో చేరగా, ఇద్దరు శ్రీరామ్ ఫైనాన్స్ బజాజ్ ఫైనాన్స్‌లో లీగల్ అడ్వయిజర్స్‌గా చేరారు. స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌కు చెందిన 12 మంది విద్యార్థులు రూ.4 లక్షల నుంచి రూ.7 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. పలు సంస్థల్లో మార్కెటింగ్, బిజినెస్ అనలిటిక్స్ విభాగాల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

నిరంతరం టచ్‌లో ఉంటూ క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నాం

వర్సిటీలోని వివిధ కోర్సులు చేసిన విద్యార్థుల వివరాలు, వారిలో ఉన్న నైపుణ్యాలతో కూడిన జాబితా రూపొందించుకుని నిరంతరం కార్పొరేట్ కంపెనీలతో టచ్‌లో ఉంటున్నాం. ఆయా సంస్థలకు అవసరమైన మానవ వనరుల గురించి మాకు సమాచారాన్ని అందించిన వెంటనే ఇంటర్వ్యూల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. పరిశ్రమలు, సంస్థలు అవసరాలకు అనుగుణంగా స్కిల్స్ నేర్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ఇందుకోసం కొన్నాళ్ల కిందట ప్రవేశపెట్టిన ఇండస్ట్రీ మెంటార్‌షిప్, ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వీటివల్ల పరిశ్రమల అవసరాలపై విద్యార్థులకు ఒక అవగాహన కలుగుతోంది. గతంతో పోలిస్తే ఆర్ట్స్ అండ్ సైన్స్ విద్యార్థులు భారీ వేతనాలతో ఉద్యోగాలను సాధిస్తున్నారు.



\- వీఆర్ రెడ్డి, ప్లేస్ మెంట్ ఆఫీసర్, సౌత్ క్యాంపస్ ఏయూ

డిమాండ్లు నెరవేర్చాలని ఈపీఎస్ పెన్షనర్ల ధర్నా



భవిష్యనిధి కార్యాలయం ఎదుట జాతీయ రహదారి వద్ద పెన్షనర్ల నిరసన

మర్రిపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ భవిష్య నిధి (పీఎఫ్) కార్యాలయ సమీపంలోని జాతీయ రహదారి వద్ద ఈపీఎస్ 95 పెన్షనర్లు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆలిండియా కో-ఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు విశాఖ జిల్లా కమిటీ అధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కమిటీ కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల సేవలో నిమగ్నమై తమ కనీస న్యాయమైన డిమాండ్లను కూడా పరిష్కరించడంలేదన్నారు. పెన్షన్ పెంచకుండా కమిటీలు వేసి కాలయాపన చేస్తోందన్నారు. ఇప్పటికైనా కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలని, ఈపీఎస్ పెన్షన్‌దారుల దంపతులకు వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును వక్రీకరించకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని నినదించారు. ఈపీఎస్ పెన్షనర్స్ కమిటీ జిల్లా కమిటీ కార్యదర్శి హుస్సేన్, పలు సంస్థల ప్రతినిధులు డీ.సీ.హెచ్.వెంకటేశ్వరరావు, ఎం.కృష్ణారావు, కాశేశ్వరరావు, తులసీరాం, మూర్తి, కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక

అక్కయ్యపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లలను మానసిక, సామాజికాభివృద్ధిలో ముందంజలో ఉంచాలన్న ఆశయానికి మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫార్సులు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పిల్లల వనరుల భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి సిబ్బంది, అధికారులు, తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. నైపుణ్యంతో కూడిన ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారు? పిల్లలకు బ్రెయిలీ లిపి, సంజ్ఞా భాష, స్పీచ్ థెరపీ వంటి ప్రత్యేక విద్యా విధానాలు ఎలా అమలు చేస్తున్నదీ సర్వశిక్ష అభియాన్ ఏపీసీ జె.చంద్రశేఖర్, జిల్లా ఐఈ కో-ఆర్డినేటర్ బిగీతలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి వివిధ సిఫార్సులు చేయనున్నట్లు చెప్పారు. అధికారులు రమణి కుమారి, రామారావు, బాలామణి పాల్గొన్నారు.

గుర్రంపాలెంలో అక్రమ క్వారీయింగ్

... 5వ పేజీ తరువాయి

భారీగా గ్రావెల్/మట్టి అవసరమైంది. అందుకు గనుల శాఖ నుంచి తాత్కాలిక పర్మిట్లు తీసుకోవాలి. కానీ అటువంటిదేమీ లేకుండా సమీపంలో గల కొండల నుంచి భారీస్థాయిలో గ్రావెల్/మట్టి తవ్వి ప్లాట్లు చదునుకు తరలించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురితం కావడంతో గనుల శాఖ, గనుల శాఖ విజిలెన్స్ అధికారులు పలుమార్లు తనిఖీలు చేశారు. గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌లో అక్రమ క్వారీయింగ్ ప్రాంతం, ఫిల్ చేసిన ప్లాట్లు పరిశీలించారు. ఈ వ్యవహారంలో గనులశాఖ విజిలెన్స్ అధికారులు సుమారు ఎనిమిది మందికి నోటీసులు జారీచేశారు. ఎంత మేర గ్రావెల్, మట్టి తవ్వి తరలించారో కొలతలు వేసి...ఆ మేరకు జరిమానా విధించాలంటూ గనుల శాఖ రెగ్యులర్ విభాగానికి సిఫారసు చేయాలి. అయితే జరిమానా విధింపుపై ఇంత వరకూ విజిలెన్స్ నుంచి రెగ్యులర్ విభాగానికి ఎటువంటి సమాచారం అందలేదు. నేతల నుంచి వచ్చిన ఒత్తిళ్ల కారణంగానే జరిమానా విధించే నోటీసులు జారీచేయాలని సూచిస్తూ రెగ్యులర్ విభాగానికి ఎటువంటి లేఖ రాయలేదని ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లకు వీర డిమాండ్

... 5వ పేజీ తరువాయి

నంబరుతో షిర్డీకి 2012లో వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి మధ్య ఆ రైలు ఆక్యుపెన్సీ 167.72 శాతం నమోదైంది. 2024 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 165.21 శాతం ఆక్యుపెన్సీ ఉంది.

- విశాఖపట్నం నుంచి 18567 నంబరుతో కొల్లాంకు 2014లో వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభించారు. ఈ రైలుకు 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 164.41 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది. 2024 ఏప్రిల్ నుంచి వరకు 163.98 శాతం ఆక్యుపెన్సీ ఉంది.
- విశాఖ నుంచి 20803 నంబరుతో గాంధీధామ్‌కు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను 2014లో ప్రారంభించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు దీని ఆక్యుపెన్సీ 107.94 శాతం ఉండగా, 2024 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 179.07 శాతం నమోదైంది.
- విశాఖపట్నం నుంచి 22801 నంబరుతో చెన్నై సెంట్రల్‌కు నడుపుతున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు 2023-24 ఆర్థిక సంవత్సరంలో 138.8 శాతం, 2024 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 139.92 శాతం ఆక్యుపెన్సీ వచ్చింది.

ఈ మార్గాల్లో వెయిటింగ్ లిస్ట్ జాబితా 227 నుంచి 805కు పెరిగింది. ఈ మార్గాల్లో ఎంత డిమాండ్ ఉందో చెప్పడానికి ఈ లెక్కలే నిదర్శనం.

విచిత్రంగా ఈ రైళ్లన్నీ విశాఖ నుంచి ఆయా గమ్యస్థానాలకు వెళ్లి ఆ మరుసటిరోజే అక్కడి నుంచి తిరిగి బయలుదేరుతున్నాయి. ఆయా నగరాల నుంచి రైలులో విశాఖపట్నం వెనక్కి రావాలంటే మళ్లీ ఈ రైలు వెళ్లేంత వరకు వారం రోజులు ఆగాల్సిందే. లేదంటే వేర్వేరు రైళ్లు మారాల్సి ఉంటుంది. రైలులో వెళ్లి అటు నుంచి విమానంలో వద్దామన్నా...షిర్డీ, గాంధీధామ్‌ల నుంచి ఆ సౌకర్యం కూడా లేదు. అందుకని వారానికి కనీసం రోజు తప్పించి రోజు ఈ రైళ్లు నడిపేలా చూడాలని విశాఖపట్నం రైలు వినియోగదారుల సంఘం తూర్పు కోస్తా రైల్వే అధికారులను కోరుతోంది.

ఢిల్లీలో ప్రయత్నిస్తేనే పచ్చజెండా

ఈ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లను వారానికి మూడు రోజులు నడిపేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ గత కొన్నాళ్లుగా వాల్తేరు డివిజన్ అధికారులు ప్రతిపాదనలు పెడుతున్నారు. అయితే ఈ రైళ్లు ఎక్కడికైతే వెళుతున్నాయో ఆ ప్రాంతానికి చెందిన రైల్వే జోనల్ అధికారులు కూడా దీనికి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. వీటికి సౌత్ సెంట్రల్, సౌత్ వెస్టర్న్ జోన్ అధికారులు అంగీకరించచడం లేదని సమాచారం. వీటిపై అధికారులపరంగానే కాకుండా రాజకీయపరమైన ఒత్తిడి ఢిల్లీలో పెడితేనే పని జరుగుతుంది. ఉత్తరాంధ్ర ఎంపీలు ఆ రకమైన ప్రయత్నాలు చేయాల్సి ఉంది.

నేటి నుంచి పూర్తిస్థాయిలో ఇంటర్ మూల్యాంకనం

... 5వ పేజీ తరువాయి

పత్రాల మూల్యాంకనం సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. క్యాంప్ ఆఫీసర్, ఏసీవో, సీపీవో, కోడింగ్ అధికారులు స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం ఒకటో విడతలో తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మాథ్స్, సివిక్స్ జవాబుపత్రాల మూల్యాంకనం జరుగుతోంది. 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రెండో విడతలో ఫిజిక్స్, ఎకానమిక్స్, జీఎఫ్‌సీ, 24వ తేదీ నుంచి జరిగే మూడో విడత కెమిస్ట్రీ, హిస్టరీ, 26వ తేదీ నుంచి నిర్వహించే నాలుగో విడతలో కామర్స్, బోటనీ, జువాలజీ, బ్రిడ్జ్ కోర్సు జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తారు. విధులకు హాజరయ్యే ఎగ్జామినర్ల సంఖ్యను బట్టి ఈ నెల 31 లేదా ఏప్రిల్ రెండో తేదీ నాటికి ప్రక్రియను పూర్తిచేస్తామని ఆర్ఐవో తెలిపారు. ప్రథమ, ద్వితీయ పరీక్షా ఫలితాలను ఇంటర్ బోర్డు ఏప్రిల్ రెండో వారంలో విడుదల చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.

భారీ వాహనాలతో బెంబేలు

... 5వ పేజీ తరువాయి

వచ్చివెళుతున్నాయి. దీనివల్ల నగర అంతర్గత రోడ్లపై వాహనాల రాకపోకలకు ఆటంకం ఎదురవుతోంది.

కొత్త జాతీయ రహదారిపైకి మళ్లించాలి

నగరంలో భారీ వాహనాల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం కొత్త జాతీయ రహదారిని అందుబాటులోకి తెచ్చింది. అనకాపల్లి నుంచి పెందుర్తి మీదుగా ఆనందపురం జంక్షన్‌లో ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిని కలుపుతూ కొత్త రహదారిని నిర్మించింది. దీనివల్ల ఒడిశా, శ్రీకాకుళం వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించకుండా ఆనందపురం వద్ద నుంచి పెందుర్తి మీదుగా అనకాపల్లి వైపు వెళ్లేందుకు అవకాశం ఉంది. అలాగే చెన్నై, విజయవాడ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు నగరంలోకి రాకుండా అనకాపల్లి నుంచి పెందుర్తి మీదుగా ఆనందపురం వైపు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా భారీ వాహనాలు నగరంలోని ట్రాఫిక్ ఇబ్బందులను తప్పించుకుని సాఫీగా ప్రయాణం సాగించవచ్చు. అదేసమయంలో నగరంలో కూడా భారీ వాహనాల తాకిడి తగ్గి, ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని భావించారు. కానీ కొత్త జాతీయ రహదారిపై రెండు టోల్‌గేట్‌లు ఉండడంతో వాటిని తప్పించుకునేందుకు భారీ వాహనాలు నగరం మధ్య నుంచి ఉన్న జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీనివల్ల కొత్త జాతీయ రహదారి నిర్మాణ లక్ష్యం నెరవేరకుండా పోయినట్టయింది. మరోవైపు నగరంలో ట్రాఫిక్ సమస్య యథావిధిగా కొనసాగుతోంది. భారీ వాహనాల రాక వల్ల ఇబ్బందులు, జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని వాటిని కొత్త జాతీయ రహదారిపైగా మళ్లించేందుకు నగర పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

లేట'రైట్'!?

... 5వ పేజీ తరువాయి

కొండపైకి చేర్చారంటున్నారు. ఈ వారంలో రహదారి మరమ్మతులు పూర్తిచేసిన తరువాత తవ్వకాలు ప్రారంభించాలని భావిస్తున్నట్టు తెలిసింది. భమిడికలొద్దిలో 121 హెక్టార్లలో లేటరైట్ తవ్వకాలకు వైసీపీ ప్రభుత్వ హయాంలో అల్లూరి జిల్లా కొయ్యూరు మండలానికి చెందిన గిరిజనుడు జర్తా లక్ష్మణరావు పేరిట అనుమతులు వచ్చాయి. అయితే లక్ష్మణరావు బినామీ మాత్రమే. అయన్ను ముందుపెట్టి వైసీపీకి చెందిన కీలక నేత కుమారుడు లేటరైట్ తవ్వకాలు చేపట్టారు. భమిడికలొద్దిలో క్వారీయింగ్, అక్కడ నుంచి రౌతులపూడి వరకు రహదారి నిర్మించిన ప్రాంతంపై అనేక వివాదాలు ఉన్నాయి. రిజర్వు అటవీ ప్రాంతంలో వేలాది చెట్లు కొట్టేసి రోడ్డు నిర్మించారు. దీనిపై నాతవరం మండలానికి చెందిన మరిడయ్య ఎన్జీటీలో ఫిర్యాదు చేయడతో విచారణ జరిగింది. ఒకపక్క విచారణ జరుగుతుండగానే పాలకుల దన్నుతో లేటరైట్‌ను తవ్వేసి లక్షల క్యూబిక్ మీటర్లు తరలించుకుపోయారు. క్వారీ ప్రాంతంలో ఇప్పటివరకూ ఎంత తవ్వారు?, రాయల్టీ ఎంత చెల్లించారు?...అన్న విషయాలు గనుల శాఖ ఎన్నడూ వెల్లడించలేదు. గత ఏడాది ఎన్నికల ముందు తవ్వకాలు ఆపారు. అప్పటికే రౌతులపూడిలో నిల్వ చేసిన లక్షల క్యూబిక్ మీటర్ల లేటరైట్‌ను ఇటీవల కొందరు ఇతర ప్రాంతాలకు తరలించారు. ఇంకా రౌతులపూడి మండలంలో మరో రెండుచోట్ల ఉన్న నిల్వలను కొద్దిరోజుల నుంచి రాత్రిపూట తరలిస్తున్నారు. ప్రభుత్వం మారడంతో లేటరైట్ తవ్వకాల నుంచి వైసీపీ కీలక నేత కుమారుడు తప్పుకోగా, ప్రస్తుతం కూటమిలో ఉన్న పార్టీకి చెందిన మరో నాయకుడు రంగంలోకి దిగారు. లీజుదారుడు జర్తా లక్ష్మణరావుకు బినామీగా నర్సీపట్నానికి చెందిన వ్యాపారిని తెరపైకి తీసుకువచ్చారు. భమిడికలొద్ది క్వారీ ఉన్న సుందరకోట పంచాయతీలో ప్రజల నుంచి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంచాయతీలో సుందరకోట, భమిడికలొద్ది, హసనగిరి, తొగ్రడ, ముంత మామిడిలొద్ది, పాత సిరిపురం, కొత్త సిరిపురం గ్రామాల ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా చూసుకునే బాధ్యతను స్థానిక నేతలకు అప్పగించారు. ఎనిమిది గ్రామాల పరిధిలో మొత్తం 500 వరకు బియ్యం కార్డుదారులుండగా ప్రతి కార్డుదారుడికి నెలకు రూ.1000 వంతున పరిహారం అందజేస్తామని హామీ ఇస్తున్నట్టు తెలిసింది.

ఇంటర్వ్యూ..

ఆటోనగర్ అభివృద్ధికి కృషి

-అయినవిల్లి కిశోర్
ఏపీఐఐసీ, ఐలా కమిషనర్



ఆటోనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరొందిన ఆటోనగర్ అభివృద్ధికి ఐలా కమిటీతో చర్చించి సమష్టి కృషితో ముందుకు సాగుతామని ఏపీఐఐసీ, ఐలా కమిషనర్ అయినవిల్లి కిశోర్ అన్నారు. ఆటోనగర్ భవిష్యత్తు ప్రణాళికలు, పారిశ్రామికవేత్తలకు అందించే సౌలభ్యాల గురించి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

ప్రశ్న: రెండు దశాబ్దాల ఆటోనగర్‌లో శిథిల డ్రైనేజీల వల్ల పరిశ్రమల యజమానులు పడుతున్న ఇబ్బందులపై మీరు తీసుకున్న చర్యలు ఏమిటి?

జవాబు: ఆటోనగర్ డీ-బ్లాక్‌లో రూ.కోటీ 85 లక్షలతో శిథిల డ్రెయిన్లకు మరమ్మ తులు, సీసీ డ్రెయిన్ల నిర్మాణాలకు టెండర్లు పిలిచాం. వీటిలో కొన్ని టెండర్లు మంజూరయ్యాయి. ఆటోనగర్‌లోని మిగతా బ్లాక్‌లలో ఉన్న శిథిల డ్రైనేజీలను కూడా బాగు చేస్తాం. చిన్న మరమ్మతులు ఉన్నవాటిని బాగు చేయించి, అవసరమైనచోట కొత్తగా డ్రైనేజీలను నిర్మిస్తాం.

ప్ర: భూగర్భ విద్యుత్ పనుల కోసం ఎక్కడపడితే అక్కడ రోడ్లను తవ్వుతున్నారు. వాటిని పూడ్చివేసే బాధ్యత విద్యుత్ శాఖదా... మీదా?

జ: భూగర్భ విద్యుత్ పనుల కోసం తవ్వుతున్న రోడ్లను విద్యుత్ శాఖ రీ-స్టోరేషన్ చేస్తుంది. రోడ్లను కట్ చేసి, మళ్లీ సీసీ రోడ్డుగా పూడ్చే బాధ్యత విద్యుత్ శాఖదే.

ప్ర: ఆటోనగర్‌లో దొంగతనాల నివారణకు చేపడుతున్న చర్యలు ఏమిటి?

జ: ప్రత్యేక గస్తీని ఏర్పాటు చేస్తాం. పోలీసుల సహకారాన్ని తీసుకుంటాం. రాత్రి వేళల్లో ఏఏ రహదారుల్లో విద్యుత్ లైట్లు వెలగడం లేదో గుర్తించి వాటి స్థానంలో కొత్తవి వేయిస్తాం. ఆటోనగర్‌లోని అన్ని బ్లాక్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు టెండర్లు పిలిచాం.

ప్ర: ఆటోనగర్ ఈ-బ్లాక్‌లో ఉన్న అనధికార డంపింగ్ యార్డు వల్ల ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై చర్యలు ఏమిటి?

జ: ఆ డంపింగ్ యార్డులో ఆటోనగర్ పరిశ్రమల వ్యర్థాలే కాకుండా బయటవారు కూడా వ్యర్థాలను వేస్తున్నట్టు గుర్తించాం. ఇక్కడి వ్యర్థాలను కాపులుప్పాడకు తరలిస్తాం. డంపింగ్‌యార్డు చుట్టూ ప్రహరీని నిర్మించి విద్యుత్, సెక్యూరిటీ, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తాం. రెండు మూడు నెలల్లో ఇక్కడ డంపింగ్ యార్డు లేకుండా చర్యలు చేపడతాం.

ప్ర: ఆర్‌టీబీ ఎప్పటిక పూర్తవుతుంది?

జ: పనులు సాగుతున్నాయి. 2026 మార్చి నాటికి పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. అలాగే ఆటోనగర్‌లోని పది బ్లాక్‌లలో శిథిలమైన రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం. ఇప్పటికే కొన్ని రహదారులను బాగు చేయించాం.

సినిమా గైడ్

● **శబ్దం** : సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
● **మజాకా** : శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
● **డ్రాగన్** : జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
● **తండేల్** : శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
● **సంక్రాంతికి వస్తున్నాం** : మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్** : శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్** : మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 14, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 44, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 40, బీరకాయలు 54, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 12, క్యారెట్ 28 దొండకాయలు 36, బంగాళదుంపలు 15, అరటికాయ (పె)6, అల్లం (పాతది)52, బరబాటి 36, ముల్లంగి 2, నిమ్మకాయలు (కిలో) 85, మునక్కాడలు (కిలో) 66, బద్దచిక్కుడు 34, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 32, కీరదోస 28, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 50, గోరుచిక్కుడు 36, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

» వార్డుల్లో పాడైపోయిన బోరింగులకు మరమ్మతు పనులు చేపట్టనున్న అధికారులు



గాజువాక చైతన్య నగర్‌లో నిరుపయోగంగా ఉన్న బోరింగులు

గాజువాక, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేసవి నీటి ఎద్దడి నివారణలో భాగంగా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలోని ప్రతీ వార్డులో నిరుపయోగంగా ఉన్న బోరింగులకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జోన్ పరిధిలో ఉన్న 19 వార్డుల్లో సుమారు 2,419 బోరింగులు ఉన్నాయి. అయినప్పటికీ అధిక శాతం మంది ప్రజలు మునిసిపల్ కొళాయిల ద్వారా వస్తున్న తాగునీటిని వినియోగిస్తుండడంతో బోరింగులను వినియోగించే వారి సంఖ్య బాగా తగ్గింది. దీంతో సుమారు 20 శాతం బోరింగులు మరమ్మతులకు గురయ్యాయి. కాగా వేసవిలో కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా అంతంతమాత్రంగానే ఉంటుండడం, తాగునీటికి ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో లేకపోవడంతో అత్యధికులు వీధుల్లో ఉన్న బోరింగులను ఆశ్రయించే పరిస్థితి నెలకొంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు ఏ వార్డులో ఎన్ని బోరింగులు మరమ్మతులకు గురయ్యాయో వాటర్ వర్క్స్ సిబ్బంది ద్వారా గుర్తించారు. ఈ మేరకు ఆయా బోరింగులకు మరమ్మతు పనులు ప్రారంభించనున్నట్టు అధికారులు వెల్లడించారు.

ప్రధానంగా వేసవిలో వివిధ కారణాల వల్ల కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా జరగని పక్షంలో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేసినా అందరికీ పూర్తి స్థాయిలో నీరు అందే పరిస్థితి ఉండదు కాబట్టి అధిక శాతం మంది బోరింగులను ఆశ్రయిస్తారు. ఈ నేపథ్యంలో మరమ్మతులకు గురైన బోరింగులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ముందస్తు చర్యలకు దిగారు. తాగునీటి సమస్య అధికంగా ఉన్నచోట అవసరమైతే కొత్త బోరింగులను వేసేందుకు కూడా అధికారులు యోచిస్తున్నారు. ఏదిఏమైనా ప్రతీ వార్డులో పాడైపోయిన బోరింగులకు మరమ్మతులు చేపట్టనుండడం వేసవిలో ప్రజలకు కొంతమేర ఊరటనిస్తుందని చెప్పవచ్చు.

అంధకారంలో సత్తివానిపాలెం-దువ్వాడ రోడ్డు

» రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న స్థానికులు, వాహనదారులు



విద్యుత్ దీపాలు లేని సత్తివానిపాలెం-దువ్వాడ రోడ్డు

గోపాలపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు పరిధి సత్తివానిపాలెం-శీలానగర్ కూడలి నుంచి దువ్వాడ వెళ్లే ప్రధాన రహదారి రాత్రి వేళల్లో ప్రమాదాలకు నిలయంగా మారింది. దశాబ్దాల కాలంగా దుర్భరంగా ఉన్న ఈ రోడ్డును ఎనిమిదేళ్ల క్రితం నిర్మించారు. గోపాలపట్నం, సబ్బవరం, శీలానగర్ మీదుగా దువ్వాడకు వందలాది మంది వాహనదారులు నిత్యం ఈ మార్గం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గం జాతీయ రహదారికి బైపాస్ రోడ్డు కావడంతో పాటు సమీపంలో వీఎస్ఈజెడ్, దువ్వాడ రైల్వేస్టేషన్‌తో పాటు పలు విద్యా సంస్థలు కూడా ఉండడంతో ఈ రహదారి ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అంత ప్రాముఖ్యం గల ఈ రహదారిలో కనీసం విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయకపోవడంతో ఈ మార్గంలో ఉన్న అహ్మద్‌నగర్, డాక్‌యార్డ్ కాలనీ, కాపుజగ్గరాజుపేట గ్రామాల ప్రజలతో పాటు ఈ రోడ్డు మీదుగా రాత్రిపూట రాకపోకలు సాగించే వందలాది మంది వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా ఈ మార్గంలో పందుల సంచారం కూడా అధికంగా ఉండటంతో వాటి మూలంగా తరచూ ప్రమాదాల బారినపడుతున్నామని పలువురు వాహనదారులు వాపోతున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ మార్గంలో విద్యుత్ దీపాల ఏర్పాటుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా జాతరలు, ఆలయ ఉత్సవాలు



వడ్లపూడిలో నిర్వహించిన శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి, శివపార్వతులు, సీతారాముల కల్యాణాల్లో పాల్గొన్న భక్తులు



పెదమడక పైడిమాంబ



అప్పన్నపాలెం పోలిపిల్లి అమ్మవారు

అగనంపూడి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో అమ్మవార్ల జాతరలు, ఆలయ ఉత్సవాలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా 85వ వార్డు పెదమడక, ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడిమాంబ జాతరను వైభవంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి ఒంటిగంటకు అమ్మవారి దర్శనాలను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపుకుంకుమలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను నిర్వాసిత గ్రామాల్లో ఊరేగించాక ఆలయం వద్దకు తెచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. బాణసంచా కాల్పులతో పాటు జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే కొండయ్యవలస బంగామ్మ అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

అదేవిధంగా 85వ వార్డు పరిధి బీసీ కాలనీలో గల రామాలయం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామిని నూతన వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. పలువురు భక్తులు సామూహిక లలితసహస్రనామ పారాయణాన్ని పఠించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: జీవీఎంసీ 72వ వార్డు పరిధి శ్రీనగర్ అఫీషియల్ కాలనీలో గల శ్రీసంపత్ వినాయకస్వామి ఆలయ 16వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో చేయడంతో పాటు హోమం జరిపారు. వేడుకల ముగింపు సందర్భంగా బుధవారం తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని టీడీపీ వార్డు అధ్యక్షుడు అక్కిన లక్ష్మణరావు తెలిపారు. సోమవారం రాత్రి జరిగిన కోలాటంలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులో వారం రోజుల పాటు జరిగిన శ్రీపైడిమాంబ ఉత్సవాలు మంగళవారం సాయంత్రం చేపట్టిన అనుపోత్సవంతో ముగిశాయి. టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రంలో పరసలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలో మంగళవారం బ్రహ్మసూత్ర శివలింగ శివాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, శ్రీసీతారాములు, శివపార్వతుల కల్యాణాలను కన్నుల పండువగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తాతాబాబు, ఎం.రాము, గోవింద్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయ వార్షికోత్సవాలను మంగళవారం వైభవంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా శ్రీమహాదుర్గ, శ్రీమహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం గణపతి హోమం, పుణ్యాహవచనం, నవనాగశక్తి మండపారాధన, నవనాగులకు పంచామృతాభిషేకాలు, పూర్ణాహుతి చేపట్టారు. సాయంత్రం అమ్మవార్ల తిరువీధి ఉత్సవాన్ని జరిపారు. ప్రధాన అర్చకులు ఫణిశర్మ నిర్వహించిన పూజల్లో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత పోలిపల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఆలయ ధర్మకర్త గొంతిన రమాశంకర్ ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను పండగను ప్రారంభించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. వైసీపీ గాజువాక కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ గుడివాడ అనూష, ఆలయ కమిటీ సభ్యులు గుడివాడ లతీశ్, ఎస్.నూకరాజు, సత్యారావు, అంజి, అప్పలరాజు తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పెందుర్తి: మండలంలోని ఎస్ఆర్‌పురంలో గల మర్లమాంబ పండగను ఘనంగా జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ జడ్పీటీసీ రెడ్డి నారాయణరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ దూది రమణ, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: అప్పన్నపాలెం పరిసర ప్రాంతాల ప్రజల ఇలవేల్పు శ్రీపోలిపిల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పరసను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం అనుపోత్సవాన్ని చేపట్టారు. పరసలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు కె.సోమునాయుడు, కె.సింహాద్రి, సతీశ్, ఈశ్వరరావు, తదితరులు భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశారు. అలాగే 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్‌లో శ్రీఉమాశంకర గణపతి సమేత శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ 25వ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

వేపగుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): టీచర్లందరూ ఎన్నో ఆశలతో తనను గెలిపించారని, వారి సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. 98వ వార్డు గోశాల సమీపంలోని వసుదేవ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సాయంత్రం పీఆర్‌టీయూ పెందుర్తి శాఖ ఆధ్వర్యంలో శ్రీనివాసులనాయుడుకు ప్రత్యేక అభినందన సభను నిర్వహించారు. యూనియన్ ప్రతినిధులు సీహెచ్ దుర్గారావు, కె.సుధాకరరావు, తదితరులు ఎమ్మెల్సీని ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ కొత్త పీఆర్సీ అమలు, యూనిఫైడ్ సర్వీస్ రూల్స్, కౌన్సెలింగ్ విధానాన్ని మ్యాన్‌వల్‌గా నిర్వహించడం, తదితర సమస్యలపై మండలిలో ప్రస్తావిస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, యూనియన్ నాయకులు ఎం.శ్రీను, కె.నాగేశ్వరరావు, గోపినాథ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

వేపగుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-8 పరిధిలో గల 93, 94, 95, 97, 98 వార్డుల పరిసర ప్రాంతాల్లో బుధవారం తాగునీటి సరఫరాకు బుధవారం అంతరాయం కలుగుతుందని తాగునీటి సరఫరా విభాగం డీఈ వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాపురం హెడ్ వాటర్ వర్క్స్‌లో మోటార్లకు మరమ్మతులు చేపట్టనున్నందున ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నీటి సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఈ కారణంగా సాయి దుర్గానగర్, దుర్గానగర్, అప్పలనరసింహంకాలనీ, లక్ష్మీపురం, పోర్టు కాలనీ, రామ కో-ఆపరేటివ్ కాలనీ, హెచ్‌బీ కాలనీ, గోకూలం కాలనీ, రెల్లివీధి, కృష్ణరాయపురం, గొల్లివిల్లిపాలెం, ఎల్ఐసీ కాలనీ, సుజాతనగర్, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి పాత ఊరు, తెలకలవీధి, జడ్పీహెచ్ఎస్ ఏరియా, ప్రశాంతినగర్, క్రాంతినగర్, వుడా కాలనీ, రైల్వే కాలనీ, సావిత్రినగర్, అప్పన్నపాలెం, సింహపురిలేఅవుట్, అడవివరం, ఎస్సీ కాలనీ, పాత అడవివరం ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పెందుర్తి సీఐ కేవీ సతీశ్‌కుమార్

పెందుర్తి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో నిర్వహించే అమ్మవార్ల పండగల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కేవీ సతీశ్‌కుమార్ హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పండగల నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు. మంగళవారం స్టేషన్‌లో పోలీస్ హెచ్చరిక బ్యానర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా సీఐ మాట్లాడారు. గ్రామ దేవతల పండగల్లో అశ్లీల నృత్యాల ప్రదర్శన, అసభ్య ప్రవర్తనకు తావివ్వరాదన్నారు. ఎవరైనా అలాంటి ప్రదర్శనలకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పేకాట, గుల్లాట, మద్యం మత్తులో చట్ట విరుద్ధ పనులకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

శంకర్ ఫౌండేషన్ అధినేతకు నివాళి

వేపగుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి నిర్మాణ సారథి అత్మకూరు శంకరరావు 13వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి ప్రాంగణంలో గల శంకరరావు విగ్రహానికి ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ, ఆయన కుమారుడు కృష్ణకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శంకరరావు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఎందరో నిరుపేదలకు కంటి వెలుగుల జ్యోతిని ప్రసాదించిన ఘనత శంకర్రావుకు దక్కుతుందన్నారు. శంకర్ ఫౌండేషన్ ఆపరేషనల్ జీఎం కె.రాధాకృష్ణన్, డాక్టర్ రవీంద్ర, ప్రొఫెసర్ కృష్ణప్రసాద్, డాక్టర్ నశ్రీన్, శిరీష, బంగార్రాజులు పాల్గొన్నారు.

పార్కు పనుల పరిశీలన

అగనంపూడి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి గల్లవానిపాలెం సమీపంలో జనచైతన్య లేఅవుట్‌లో జీవీఎంసీ నిధులతో చేపడుతున్న పార్కు నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కుతో పాటు ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఈ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా పార్కును ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గల్లా రుద్రకుమార్, కరణం జగదీశ్, సుబ్బరాజు, సింగిడి సింహాచలం, పి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న ఉక్కు కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు, కార్మికులు

ఒక్క కార్మికుడిని తొలగించినా సహించం

ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని తొలగించినా సహించేది లేదని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు హెచ్చరించారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపునకు నిరసనగా మంగళవారం ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో ఒక్క కార్మికుడిని తొలగించరాదని, అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే నిర్వాసితులకు ఉపాధి కల్పించడంతో పాటు కాంట్రాక్టు కార్మికులకు సౌకర్యాలను కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణ, మంత్రి రవి, వంశీకృష్ణ, అప్పారావు, ఆనంద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మిగులు భూములను నిరుద్యోగులకు కేటాయించాలి

స్టీల్‌ప్లాంట్ మిగులు భూములను నిర్వాసిత నిరుద్యోగులకు కేటాయించాలని టీఎన్‌టీయూసీ స్టీల్ అధ్యక్షుడు నమ్మి సింహాద్రి కోరారు. ప్లాంటులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి లభిస్తుందన్న ఆశతో నాడు నిర్వాసితులు భూములిచ్చారని, కానీ నేడు చాలామందికి ఇంకా ఉపాధి కలగలేదన్నారు. ప్లాంట్ మిగుల భూములను కర్మాగారం అభివృద్ధికి వాడాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నరేంద్ర, సొంబాబు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కులో పూర్తి స్థాయి ఉత్పత్తిని చేపట్టాలి

స్టీల్‌ప్లాంటులో పూర్తి స్థాయి ఉత్పత్తి చేసేందుకు యాజమాన్యం తగిన చర్యలు చేపట్టాలని సీఐటీయూ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి.అప్పారావు కోరారు. ప్లాంటులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యల పరిష్కారానికి యాజమాన్యం కుంటిసాకులు చెబుతూ కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ఒకపక్క ఉద్యోగులను తగ్గిస్తూ, మరోపక్క అధిక ఉత్పత్తి ఎలా సాధ్యమవుతుందో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. నాయకులు యు.రామస్వామి, గంగాధర్, పి.శ్రీనివారాజు, యు.వెంకటేశ్వర్లు, తౌడన్న, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా కోరమాండల్ ప్రయోగ్ ఉత్సవ్



ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు

మల్కాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఎరువుల కర్మాగారం ప్రాంగణంలో మంగళవారం కంపెనీ యాజమాన్యం ప్రయోగ్ ఉత్సవం పేరిట సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించింది. సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞానసుందరం, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ రమణమూర్తి ప్రారంభించారు. అనంతరం రమణమూర్తి మాట్లాడారు. ప్రతి ఏటా కోరమాండల్ కంపెనీ విద్యార్థుల్లో సాంకేతిక చైతన్యం కల్పించే దిశగా సైన్స్‌ఫెయిర్‌లను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. జ్ఞానసుందరం మాట్లాడుతూ ఉత్సవంలో 26 పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు 146 ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారని తెలిపారు. ప్రతి ప్రాజెక్టు ఆలోచన రేకెత్తించేదిగా ఉందన్నారు. కార్యక్రమంలో ములగాడ తహసీల్దార్ ఎం.భుజంగరావు, జడ్పీ రాము, కోరమాండల్ డీజీఎం (హెచ్ఆర్) ఆర్.శ్రీనివాసరావు, ప్రధాన భద్రత అధికారి నారాయణ పాత్రుడు, సీనియర్ మేనేజర్ శ్రీకాంత్, డీఎం (సీఎస్ఆర్) వెంకటరమణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

ఆటోనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి సీడ బ్యూనీ కార్యాలయంలో మంగళవారం లీఫార్మా ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని లీఫార్మా డైరెక్టర్ ఆళ్ల రాణి, కార్పొరేటర్ బొండా జగన్ లు ప్రారంభించారు. బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, గుండె సంబంధిత వ్యాధులు, యూరిక్ యాసిడ్ టెస్ట్, బోన్ డెన్సిటీ టెస్టు, ఈసీజీ, ఆర్థోపెడిక్, తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు కార్మికులకు పోషకాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు రఘుబాబు, మాధురి, భాగ్యలత, సరోజిని, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

97వ వార్డులో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

పెందుర్తి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 97వ వార్డు పరిధి చినముషిడివాడ, క్రాంతినగర్‌లో గల పార్కుల్లో, ఎంఈఎస్ లేఅవుట్, శ్రమశక్తి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను మంగళవారం ప్రారంభించారు. కార్పొరేటర్ సేనాపతి వసంత హాజరై హైమాస్ట్ లైట్లను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు పరిధిలో గల అన్ని కాలనీల ముఖ్య కూడళ్లలో హైమాస్ట్ వీధి దీపాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సేనాపతి శంకర్రావు, స్వామి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల రీడింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలి

మల్కాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ల రీడింగ్ పనులు చేస్తూ ఉపాధి పొందుతున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఈపీడీసీఎల్ డీఈ బీకే నాయుడుకి మంగళవారం పలువురు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తుండడం వల్ల తమ ఉపాధి ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఎస్క్రో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని, ఇతర సమస్యలను డీఈకి వివరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ ఉద్యోగులమైన తాము ఆందోళన చేస్తున్నట్టు పేర్కొన్నారు. డీఈని కలిసిన వారిలో మీటర్ రీడింగ్ ఉద్యోగులు ఈ.కృష్ణమోహన్, ఏజే ఖాన్, బి.నగేశ్, ఆర్.ఈశ్వరరావు, ఎన్.శ్రీనివాసరావు, బి.రాజేశ్, క్రాంతి, ఎల్.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవలు

మల్కాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా షిప్‌యార్డుకాలనీలోని జీవీఎంసీ పాఠశాలను పునర్నిర్మించి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షిప్‌యార్డు కమాండోర్ సంజయ్‌కుమార్ మహాపాత్ర పాల్గొని మాట్లాడారు. షిప్‌యార్డు ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ బాధితులు... మానసిక ఒత్తిడి

సమస్య బారినపడి కోలుకుంటున్న వారిని వేధిస్తున్న అనేక ఇబ్బందులు

చిన్నచూపు చూస్తున్న సమాజం, కుటుంబం

ఏయూ సైకాలజీ విద్యార్థి పరిశోధన







- ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 110 మంది బాధితుల నుంచి అభిప్రాయాల సేకరణ
- కోలుకునేందుకు కుటుంబ సభ్యుల నుంచి మద్దతు, కౌన్సెలింగ్ అత్యంత కీలకం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గడిచిన కొన్నాళ్లుగా బ్రెయిన్ స్ట్రోక్ బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారిలో మాత్రమే ఈ సమస్య కనిపించేది. ఇప్పుడు వయసుతో నిమిత్తం ఉండడం లేదు. బ్రెయిన్ స్ట్రోక్ బారినపడిన వారిలో కాళ్లు, చేతులు చచ్చుబడిపోవడం, మూతి వంకర పోవడం వంటి ఇబ్బందులు ఉంటాయి. స్ట్రోక్ బారినపడిన వారిలో ఎక్కువ మంది సాధారణ స్థితికి రావడానికి చాలాకాలం పడుతుంది. స్ట్రోక్ తరువాత దాదాపు 80 శాతం మంది వైకల్యంతో బాధపడుతుంటారు. ఇలా స్ట్రోక్ బారినపడి పక్షవాతానికి గురైన బాధితులపై ఏయూ సైకాలజీ విభాగానికి చెందిన విద్యార్థి పరిశోధన చేశారు. 'పక్షవాత బాధితుల్లో మానసిక ఒత్తిడి-జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో తగ్గుతున్నాయి' అనే అంశంపై నార్త్ కోస్టల్ ఏపీకి చెందిన బాధితులపై భరత్‌కుమార్ పరిశోధన సాగించారు. ఏయూ సైకాలజీ విభాగాధిపతి ఎంవీఆర్ రాజు ఆధ్వర్యంలో సాగిన ఈ పరిశోధన తాజాగా ముగిసింది.

బ్రెయిన్ స్ట్రోక్ బారినపడి కోలుకుంటున్న బాధితులు తీవ్రమైన డిప్రెషన్‌తో బాధపడుతున్నట్టు పరిశోధనలో తేలింది. స్ట్రోక్ తరువాత జీవన ప్రమాణాలు గణనీయంగా తగ్గాయి. ఆర్థిక ఇబ్బందులు, ఫ్యామిలీలో కొన్నిరకాల సమస్యలు ఉత్పన్నం కావడం, జీవితం అయిపోయిందనే భావనలోకి వెళ్లడం, ఆత్మస్థైర్యాన్ని చాలామంది కోల్పోవడం, కుటుంబ సభ్యుల నుంచి ఆదరణ ఆశించిన స్థాయిలో లేకపోవడం, పనిచేయలేని స్థితికి చేరడం, సంపాదించే పరిస్థితి లేకపోవడం, ఉద్యోగంలోనూ ప్రాధాన్యం తగ్గించడం (ఉద్యోగులు బాధితులైతే), స్థానాలను మార్చడం..వంటి అనేక ఇబ్బందులను బాధితులు ఎదుర్కొంటున్నట్టు పరిశోధక విద్యార్థి తేల్చారు.

వీటి వల్ల బాధితులు తీవ్రమైన మానసిక సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తించారు. స్ట్రోక్ బారినపడిన తరువాత ఎక్కువ మందిలో పిల్లల పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. కుటుంబం, సమాజం కూడా చిన్నచూపు చూడడం, గతంలో మాదిరిగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం కూడా మానసికంగా కుంగుబాటుకు గురిచేస్తున్నాయి. దీనివల్ల బాధితుల్లో నాణ్యమైన జీవన ప్రమాణం తగ్గుతోంది.

భరోసా అత్యంత కీలకం

స్ట్రోక్ బాధితుల జీవన ప్రమాణాలను పెంచేందుకు, ఒత్తిడి, ఇతర మానసిక సమస్యలు బారినపడకుండా ఉండేందుకు కుటుంబ సభ్యుల నుంచి భరోసా ఉండాలి. అదే సమయంలో శారీరకంగా కోలుకునేందుకు ఫిజియో థెరపీకి ప్రాధాన్యం ఇవ్వాలి. ఒత్తిడి, ఇతర మానసిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు అవసరమైన సైకలాజికల్ కౌన్సెలింగ్ అవసరం. ఫ్యామిలీ, వ్యక్తిగత కౌన్సెలింగ్ ఇవ్వాలి. అలాగే, కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ, బిహేవియర్ మాడిఫికేషన్, మెడిటేషన్, యోగా, రిలాక్సేషన్ టెక్నిక్స్ పాటించడం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చు.

మూడు జిల్లాల్లో నమూనాలు

ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 110 మంది బాధితులను ఈ పరిశోధనలో భాగంగా కలిసి అనేక వివరాలను సేకరించారు. వీరిలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందినవారు 110 మంది ఉండగా, శ్రీకాకుళం జిల్లాకు చెందినవారు 17 మంది, విజయనగరం జిల్లాకు చెందినవారు 15 మంది ఉన్నారు. వీరంతా దాదాపు ఇవే ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్టు పరిశోధక విద్యార్థి గుర్తించారు.

ఒత్తిడితో గణనీయంగా తగ్గిపోతున్న జీవన ప్రమాణం



\- పీవీఎస్ఆర్ భరత్‌కుమార్, పరిశోధక విద్యార్థి

సాధారణంగా స్ట్రోక్ వచ్చిన తరువాత శారీరక ఇబ్బందులతోపాటు మానసికంగానూ అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుండడంతో జీవన ప్రమాణం గణనీయంగా తగ్గుతోంది. ఈ కుంగుబాటు నుంచి బయటపడేందుకు కుటుంబ సభ్యుల నుంచి భరోసా కావాలి. అది దక్కకపోవడం వల్లే ఇబ్బంది ఎదురవుతోంది. సాధారణ స్థితికి చేరుకోవడానికి ఫిజియో థెరపీ,కౌన్సిలింగ్ వంటివి అత్యంత కీలకపాత్ర పోషిస్తాయి. పరిశోధనలో భాగంగా గుర్తించిన అంశాలను బట్టి వారికి కొన్ని రికమండ్ చేశాం. ఇందులో కౌన్సెలింగ్, కాగ్నెటివ్ బిహేవియర్ థెరపీ వంటివి ఉన్నాయి. 2020 నుంచి 2024 మధ్య ఈ పరిశోధన సాగింది.

కుటుంబ సభ్యుల భరోసా అత్యంత కీలకం

\- ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, ఏయూ సైకాలజీ విభాగాధిపతి, గైడ్



స్ట్రోక్ బాధితుల పట్ల సమాజం, కుటుంబ సభ్యులు వ్యవహరించే తీరు వారిని మరింత వేదనకు గురి చేస్తుంటుంది. స్ట్రోక్ వచ్చిన వారిని సమాజం కూడా చిన్నచూపు చూస్తుంది. కుటుంబ సభ్యులు గతంలో ఇచ్చిన గౌరవాన్ని ఇవ్వరు. ఇవన్నీ వారిని తీవ్రమైన మానసిక కుంగుబాటుకు గురిచేస్తుంటాయి. స్ట్రోక్ వల్ల అప్పటికే తగ్గిన జీవన ప్రమాణం... ఈ తరహా మాటలు, చర్యల వల్ల మరింత తగ్గుతుంటుంది. జీవన ప్రమాణాన్ని పెంచాలంటే కుటుంబ సభ్యులు భరోసా అత్యంత కీలకం. అదే సమయంలో కౌన్సెలింగ్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది.

భీమిలి తీరంలో నిర్మాణాల పరిశీలన

- నిబంధనలకు వ్యతిరేకంగా రెస్టోబార్‌లు, రెస్టారెంట్లు
- హైకోర్టు ఆదేశాల మేరకు తనిఖీ చేసిన అధికారుల బృందం



భీమిలి బీచ్‌రోడ్డులోని బీచ్ రిసార్ట్సును పరిశీలిస్తున్న అధికారుల బృందం

భీమునిపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్‌రోడ్డులో సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా రెస్టారెంట్లు, రెస్టోబార్‌లు, రిసార్టులు నిర్వహిస్తున్నారన్న అభియోగంపై మంగళవారం అధికారుల బృందం పరిశీలించింది. ఈ కమిటీలో భీమిలి ఆర్డీవో కె.సంగీత్ మాధుర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ (ఫైనాన్స్) ఎస్ఎస్ వర్మ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ ఎన్ఐవో చీఫ్ సైంటిస్ట్ వీవీఎస్ఎస్ శర్మ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియరు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరు పీవీబీఎల్‌జీ శాస్త్రి తదితరులున్నారు. జనసేన కార్పొరేటర్ పి.మూర్తియాదవ్, గ్రామాభివృద్ధి సేవా సంఘం హైకోర్టులో కేసులు వేయడంతో కోర్టు ఆదేశాల మేరకు కమిటీ సీ హార్స్ రెస్టో బార్ (ప్రస్తుతం బి-జాగ్), కొబ్బరిచెట్ల పార్క్ వద్దనున్న బీచ్ రిసార్ట్సు, తొట్లకొండ వద్ద శాంటమ్‌బార్ అండ్ రెస్టారెంట్, తిమ్మాపురం జంక్షన్‌లోని విరాగో రెస్టో బార్, ఎర్రమట్టిదిబ్బలవద్ద మార్లిన్ కే రెస్టారెంట్‌లను పరిశీలించింది. గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, కార్పొరేటర్ మూర్తియాదవ్ నిబంధనల ఉల్లంఘనలను బృందానికి వివరించారు. రెస్టారెంట్ యాజమాన్యం శ్మశానవాటికను వినోద కార్యక్రమాలకు వినియోగిస్తోందన్నారు. కొబ్బరితోట పార్క్‌ను ఆనుకుని నిర్వహిస్తున్న బీచ్ రిసార్ట్స్ మత్స్యశాఖకు చెందిన స్థలాన్ని ఆక్రమించారన్నారు. కోర్టు ఆదేశాలతో పరిశీలించామని, నివేదిక ఉన్నతాధికారులకు, కోర్టుకు నివేదిస్తామని తెలిపారు. ఈ పర్యటనలో జెడ్పీ ప్రేమ ప్రసన్నవాణి, ఏసీపీ రామకృష్ణ, అల్లిపిల్లి నరసింగరావు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా అభివృద్ధి నమూనా

- సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

సీతంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో అభివృద్ధి నమూనా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, సంపద కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని ప్రముఖ సామాజికవేత్త ఆచార్య జి.హరగోపాల్ అన్నారు. 'ఆపరేషన్ కగార్' పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న దమనకాండను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్య వక్తగా ఆయన ప్రసంగించారు. మానవీయత, సమష్టి కోణాల్లో అభివృద్ధి ఉండాలన్నారు. 'నీ కోసమే నువ్వు జీవించు' అన్న విధానం వస్తోందని, సంక్షేమాన్ని మనిషి ఆలోచనల నుంచి తొలగించే ప్రయత్నం జరుగుతోందని, ఇలాంటి పరిస్థితులు సమాజాన్ని విధ్వంసం వైపు తీసుకెళ్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో అభివృద్ధి పేరిట అణచివేత జరుగుతోందని విమర్శించారు. బస్తర్ ప్రాంతంలో పోలీసు శిబిరాల వెనుక అక్కడి ఖనిజ సంపదనుకార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్ర ఉందన్నారు. మావోయిస్టుల ఏరివేత వెనక ఉద్దేశం కూడా ఇదేనన్నారు. తమ సంస్కృతిని ధ్వంసం చేయడాన్ని ఆదివాసీలు అంగీకరించరని, వారి వ్యతిరేకతతో వేదాంత కంపెనీ వెనక్కి వెళ్లిపోయిందన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు వి.ఎస్.కృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగంలో సక్రమించిన హక్కులు, ప్రభుత్వాలు చేసిన భూసంస్కరణలు వంటి చట్టాలను అమలుచేస్తే మావోయిస్టుల సమస్య ఉత్పన్నం కాదన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ, పర్యావరణవేత్త గంజివరపు శ్రీనివాస్, ఆదివాసీ హక్కుల నేత రామారావు దొర తదితరులు ప్రసంగించారు. సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, న్యాయవాది వి.కళ్యాణ రామారావు, వామపక్ష నేతలు ఎం.పైడిరాజు, వై.కొండయ్య, డి.లలిత, ఎ.విమల, పద్మ, ఎం.లక్ష్మి, ఎం.వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీకి అండగా నిలిస్తే సముచిత స్థానం

- వైసీపీ కార్పొరేటర్లకు ఉత్తరాంధ్ర సమన్వయకర్త కన్నబాబు హామీ

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పార్టీ కష్టకాలంలో అండగా నిలిచే కార్పొరేటర్లకు భవిష్యత్తులో సముచితస్థానం ఉంటుందని వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త కురసాల కన్నబాబు హామీ ఇచ్చారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానానికి కూటమి పెద్దలు పావులు కదుపుతుండడంతో నేతలు అప్రమత్తమయ్యారు. వైసీపీ కార్పొరేటర్లు పార్టీ మారుతారనే ప్రచారం నేపథ్యంలో మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం 37 మంది కార్పొరేటర్లతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడారు. పార్టీ అవకాశం ఇవ్వడం వలనే కార్పొరేటర్లుగా ఎన్నికయ్యారని, అండగా నిలిస్తే భవిష్యత్తులో మళ్లీ అధికారంలోకి వస్తామన్నారు. అప్పుడు సముచిత స్థానం, గౌరవం లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా కొంతమంది కార్పొరేటర్లు సమన్వయకర్తలతో ఇబ్బంది పడుతున్నామని ఫిర్యాదుచేశారు. తూర్పు నియోజకవర్గానికి సమన్వయకర్తను ప్రకటించలేదని, నేతలు, కార్యకర్తలకు ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం పార్టీ మారే అవకాశం ఉందని భావిస్తున్న కార్పొరేటర్లతో కన్నబాబు మాట్లాడారు. మేయర్‌పై అవిశ్వాసతీర్మానానికి నోటీసు ఇస్తే కార్పొరేటర్లను క్యాంప్‌నకు తరలిస్తామన్నారు. పార్టీలో ఉన్న కార్పొరేటర్లకు నజరానా ఇవ్వాలని కౌన్సిల్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న నలుగురు నేతలను ఆదేశించినట్టు సమాచారం. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్‌కు వీడ్కోలు



సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్‌ను ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

విశాఖపట్నం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్‌ను విశాఖపట్నం పోర్టు అథారిటీ చెర్మన్ డాక్టర్ ఎం అంగముత్తు వీడ్కోలు పలికారు. సోమవారం నగరానికి చేరుకున్న బృందం రాత్రి ఇక్కడే బసచేసి మంగళవారం ఉదయం బయలుదేరింది. ఈ సైక్లోథాన్‌ను పోర్టు చైర్మన్ జెండా ఊపి సాగనంపారు. సీఐఎస్ఎఫ్ 56వ రైజింగ్‌డేను పురస్కరించుకొని సైక్లోథాన్ నిర్వహిస్తున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈనెల 7న తమిళనాడు అరక్కోణం నుంచి వర్చువల్‌గా ఫ్లాగ్‌ఆఫ్ చేశారు. ఈనెల 31న కన్యాకుమారి వివేకానంద రాక్‌మెమోరియల్ వద్ద ముగియనుంది.

ఐక్యరాజ్య సమితిలో హిందీ వినియోగానికి చర్యలు



భారత రాయబార కార్యాలయ ప్రధానాధికారి హరీశ్‌తో సమావేశమైన యార్లగడ్డ

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్యసమితిలో హిందీ భాష వినియోగానికి సంబంధించిన ప్రక్రియ వేగంగా సాగుతోందని విశ్వ హిందీ పరిషత్తు జాతీయ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఐక్యరాజ్యసమితి శాశ్వత భారత రాయబారకార్యాలయ ప్రధానాధికారి పర్వతనేని హరీశ్‌తో మంగళవారం న్యూయార్క్‌లో సమావేశమయ్యారు. ఐక్యరాజ్యసమితి నుంచి హిందీలో వార్తలు ప్రసారం చేయడంతో పాటు మరింత మందికి భాషను చేరువ చేసే ప్రాజెక్టును మరో ఐదేళ్లు పొడిగించేందుకు ఒప్పందం కుదిరిందని, ఇందుకోసం భారత్ ప్రతి ఏటా రూ.13 కోట్లు అందిస్తోందన్నారు. ప్రస్తుతం వెబ్‌సైట్ ద్వారా జరుగుతున్న కార్యక్రమాన్ని త్వరలో యాప్‌ను సృష్టించి పటిష్టం చేసే ఆలోచన ఉందన్నారు. భారత విదేశాంగ మంత్రిగా అటల్ బిహారీ వాజ్‌పేయి తొలిసారి ఐక్యరాజ్యసమితిలో హిందీలో ప్రసంగించారని, అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు కూడా హిందీలోను ప్రసంగించారని, ప్రస్తుతప్రధాని నరేంద్రమోదీ విదేశాల్లో జరిగే ప్రతి కార్యక్రమంలోనూ, వివిధ దేశాధినేతలతో జరిపే చర్చలను హిందీలోనే సాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఐక్యరాజ్య సమితిలో అధికార భాషలుగా ఉన్న అరబిక్, చైనీస్, ఇంగ్లీష్, ఫ్రెంచి, రష్యన్, స్పానిష్‌లతో పాటు హిందీని కూడా చేర్చాలన్నదే వాజ్‌పేయి కల అని పేర్కొన్నారు.

క్రైం... crime news

బాపట్ల జిల్లాలో రోడ్డు ప్రమాదం

నగరానికి చెందిన యువకుడి మృతి



బీమన నవీన్ మృతదేహం

మార్టూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా 216వ జాతీయ రహదారి మార్టూరు మండలం బొల్లాపల్లి టోల్‌ప్లాజా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖ నగరానికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. మరో నలుగురికి గాయాలయ్యాయి. సంఘటన వివరాలివి...

నగరానికి చెందిన బీమన నవీన్ (26) హైదరాబాద్‌లో ఉద్యోగ రీత్యా నివసిస్తున్నాడు. వారం రోజుల కిందటస్నేహితులు రవితేజ, జయభారతితో కలిసి కారులో గుంటూరు వచ్చారు. శ్రీనివాసరావుపేట మూడోలైనులో ఉంటున్న స్నేహితులు మణికంఠ, భావన దంపతులతోపాటు, వారి నాలుగేళ్ల పాప, అఖిల్‌తో కలిసి కారులో కాళహస్తి, రామేశ్వరం, తిరుపతి, పళని తదితర పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు. తిరిగి గుంటూరుకు వస్తుండగా బొల్లాపల్లి టోల్‌ప్లాజా సమీపంలో కారు ముందు టైరు పేలిపోయి కల్వర్టు గోడను ఢీకొంది. ఈ ఘటనలో నవీన్‌తో పాటు మిగిలిన నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. నవీన్ ఒంగోలు సమీపంలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఎయిర్ బెలూన్లు తెరచుకోవడంతో మిగిలిన వారు గాయాలతో బయటపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మార్టూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అక్కయ్యపాలెంలో భారీ చోరీ

- 17 తులాల బంగారం, రూ.25 వేలు మాయం

సీతంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెంలోని ఓ ఇంటిలో దొంగలు చొరబడి బీరువా తాళాలు పగలగొట్టి బంగారు వస్తువులు, నగదు అపహరించారు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... అక్కయ్యపాలెంలో రెయ్యి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆదివారం కుటుంబ సభ్యులతో గోపాలపట్నం సమీపంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చిన శ్రీనివాసరావు తన కిందింటిలో తలుపు తీసి ఉండటాన్ని చూశారు. లోపలికి వెళ్లి చూసేసరికి బీరువా తాళం విరగ్గొట్టి వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో దొంగతనం జరిగిందని గ్రహించి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 17 తులాల బంగారం, రూ.25వేలు చోరీ అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. స్టేషన్ క్రైం ఎస్ఐ సత్యారావు సంఘటనస్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. చోరీ జరిగిన ఇంటి చుట్టుపక్కల సీసీ కెమేరాలను పరిశీలించి నిందితుల కోసం దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన ఇంటికి సమీపంలో గల ఒక సెలూన్‌షాపులో కూడా దర్యాప్తుచేపట్టి సమాచారం సేకరిస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురిని పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. గుంటూరుకు చెందిన జొన్నల నాగ సతీష్ రెడ్డి 5.4 కిలోల గంజాయిని విజయవాడకు తరలిస్తూ, శ్రీకాకుళం, విజయనగరానికి చెందిన దేవరశెట్టి కళ్యాణ్, బోర ప్రసాద్ ఐదు కిలోల గంజాయి బెంగళూరుకు, ఒడిశాకు చెందిన దిలీప్ బాగ్, బిరేంద్ర రానాలు 13 కిలోల గంజాయిని మహారాష్ట్రకు రవాణా చేస్తుండగా పట్టుబడ్డారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్ఐ కీర్తిరెడ్డి, జీఆర్పీ ఎస్ఐలు ఎస్.రామారావు, కె.శాంతారామ్, ఎస్.కె.అబ్దుల్ మారూఫ్‌లు తనిఖీలు నిర్వహించారు.

మాస్టర్‌ప్లాన్ రహదారులను వెంటనే అభివృద్ధి చేయండి

- కలెక్టర్ ఆదేశం



రహదారి ప్లాన్ పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మధురవాడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మధురవాడ పరిసర ప్రాంతాల్లోని మాస్టర్‌ప్లాన్ రహదారుల అభివృదికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్‌హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. నగరంపాలెం రోడ్డు, రేవళ్లపాలెం రోడ్డులో ఎంతమందికి టీడీఆర్‌లు మంజూరయ్యాయి? ఎంతమందికి ఇవ్వాలో ఆరా తీశారు. అర్హులందరికీ తక్షణమే టీడీఆర్‌లు ఇచ్చి మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సీసీపీ ప్రభాకర్, డీసీపీ హరినాథ్, వీఎంఆర్డీఏ ప్లానింగ్ అధికారి కూన వెంకటేశ్వరావు, ఏసీపీ తిరుపతిరావు తదితరులున్నారు.

ఫుట్‌బాల్ టోర్నీకి విశాఖ సీనియర్ జట్టు



విశాఖ జట్టు ఆటగాళ్లతో చీఫ్ కోచ్ గణేష్ తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సూపర్ కప్ సీనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీలో విశాఖ జిల్లా జట్టు ప్రాతినిధ్యం వహించనుంది. ఈ నెల 20 నుంచి 27 వరకు అనంతపురంలో జరిగే ఈ టోర్నీలో 22 మందితో కూడిన జట్టును మంగళవారం ప్రకటించారు. జట్టులో బంగారు వంశీ, దొడ్డి సాగర్‌కుమార్, జి.రాజ్‌కుమార్, ఎం.నిఖిల్, బి.నవీన్‌కుమార్, పి.ఆకాష్ వర్మ, ఎం.అమన్, ఎస్.కౌశిక్, సీహెచ్.మురళి, వై.ప్రణీత్, బి.నవీన్‌కుమార్, సీహెచ్.పవన్‌బాబు, టి.కిరణ్‌కుమార్, పి.అవినాష్, బి.ఎం.సాయిచరణ్, ఎస్ఎస్‌వీ హర్ష, కృష్ణ గుప్త, అమిష్, మోహిత్, విశాల్, నిఖిల్, గోవింద్ ఉన్నారు. హెడ్ కోచ్‌గా గణేష్ (రైల్వేస్), సహాయ కోచ్‌గా యశ్వంత్, మేనేజర్‌గా వి.మోహన్‌కుమార్, ఫిజియోగా ఆర్.వి.త్రినాథరావు వ్యవహరిస్తారు.

'ఏయూలో ఎయిడెడ్ ఫ్యాకల్టీని వెనక్కి పంపండి'

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న ఎయిడెడ్ ఫ్యాకల్టీని వెనక్కి పంపించాలని పలువురు ప్రొఫెసర్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావును కోరారు. ఈ మేరకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. నిబంధ నలకు విరుద్ధంగా వర్సిటీలో చేరిన వారిని వెనక్కి పంపించాలని కోరారు. కాలేజియేట్ డైరెక్టర్ నుంచి వచ్చిన ఉత్తర్వులపై వర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ప్రొఫెసర్ నల్లా సత్యనారాయణ, ప్రొఫెసర్ లిల్లీ గ్రేస్, డాక్టర్ అర్జునుడు, డాక్టర్ బీస్పీ డాక్టర్ వి.ధర్మరాజు తదితరులున్నారు.